# జీవితము – యోగము



## అఖిల

అఖిల
భారత
పత్రిక
జూలై 2012

18/7/2012

# జీవితము — యోగము

## అత్యంత గొప్ప రహస్యం



## యోగం, కర్మలలో నైపుణ్యం

శ్రీమాత మూడు నాటకాలను 'సెంటర్ ఆఫ్ ఎడ్యుకేషన్' లోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, డిశంబరు 1 వార్షికోత్సవంలో ప్రదర్శించడానికి వ్రాశారు. 'భవిష్య దృష్టి' 1949 లోనూ 'గొప్ప రహస్యం' 1954 లోనూ, 'సత్యానికి ఆరోహణ' 1957 లోనూ, ప్రదర్శించబడినవి. ఫిబ్రవరి 2011 అఖిలలో 'భవిష్యదృష్టి' ముద్రించబడింది; ఏప్రియలు 2011 లో 'సత్యానికి ఆరోహణ' వేయబడింది. ఈ సంచిక అఖిలలలో 'గొప్పరహస్యం' ముద్రిస్తున్నాము.

# గొప్ప రహస్యం

## స్వగతాలు చెప్పే ఆరు భూమికలు మరియు ముగింపు

సంకలనం: శ్రీమాత

సహకారం: నళిని (రచయిత),

పవిత్ర (శాస్త్రవేత్త),

ఆంద్రే (పారిశ్రామికవేత్త),

ప్రణబ్ (వ్యాయామ క్రీడాకారుడు)

## గొప్ప రహస్యం గురించి శ్రీమాత వ్రాసిన లేఖ

ప్రియమైన ఆంద్రే

నీవు చాలా పని ఒత్తిడితో సతమతమవుతూ ఉండే మనిషివని నాకు తెలుసు, దాని మూలంగా నీవు నాకు ఎక్కువ సమయాన్ని కేటాయించలేవు. అయినప్పటికీ, నా కోసం ఒక పని చేయమని నిన్ను అడుగుతున్నాను, నీకు అది సాధ్యమవుతుందనే ఆశాభావంతో ఉన్నాను.

ప్రస్తుత విషయం ఇది.

డిశంబరు ఒకటవ తారీకు నుంచి నేను ఏ నాటక విభాగానికీ చెందనటువంటిదానినొకటి తయారుచేస్తున్నాను. దానిని కచ్చితంగా నాటకం అనలేం. కాని అదేదైనప్పటికీ, దానిని రంగస్థలం మీద నటింపజేయాలి, అది ఆసక్తిని కలిగించకుండా ఉండబోదనే నేను అనుకుంటున్నాను. విభిన్నమైన జీవితాలు, వృత్తులుకల మనుషుల ద్వారా నేను చెప్పదలచుకున్నది చెప్పించాలనుకుంటున్నాను, సహజంగానే వారందరూ ఒకే భాష మాట్లాడకుండా ఉంటే మంచిది. వారి హావభావశైలిలో తేడా ఉండాలనేదే నా భావన. నేను చాలామందిని, ఏదో ఒక పాత్రలో ఒదిగిపోయి, వారి దృక్పథం ప్రకారం ఆ పాత్ర ఏం చెబుతుందనే విషయాన్ని నా కోసం వ్రాయమని అడిగాను. ఆ తరువాత దానికి ఏమయినా మెరుగులు దిద్దవలసివస్తే, అది నేను చేస్తాను.

నేను ఉపోద్ఘాతాన్ని, దీనితో పాటు పంపిస్తున్నాను. తెర తీసేముందు దానిని చదువుతారు; అది నీకు నేను ఏమి చేయాలనుకుంటున్నాను అనే దాని మీద ఒక

నేను ముఖ్యమైన విషయమేదీ వదిలిపెట్టలేదనే అనుకుంటున్నాను. కానీ నీకు ఏవైనా వివరాలు కావలసివస్తే, వాటిని నేను పంపగలను.

జూలై 7, 1954

# గొప్ప రహస్యం

## ఆరు భూమికలు — ముగింపు

ప్రపంచంలోని ఆరుగురు గొప్ప వ్యక్తులు మానవపురోభివృద్ధికి సంబంధించిన ప్రపంచ మహాసభలకు వెడుతుండగా, పూర్తిగా యాదృచ్ఛికంగా, వారు ప్రయాణిస్తున్న పడవ సముద్రం నడిమధ్యలో మునిగిన కారణంగా, వారందరూ, ఒక రక్షణనౌకలో ఆశ్రయం పొందారు.

ఆ నౌకలో ఏడవ వ్యక్తి కూడా ఉన్నాడు. అతడు చాలా యువకునిలా లేక మరొక విధంగా చెప్పాలంటే, నిత్యయవ్వనుడిలా ఉన్నాడు. అతని వేషధారణను బట్టి అతడు ఏ దేశానికీ, కాలానికీ చెందినవాడిలాగా అనిపించడం లేదు. అతడు చుక్కాని వద్ద కూర్చున్నాడు కదలకుండా. నిశ్శబ్దంగా ఉన్నా, తక్కినవారు చెప్పే దానిని శ్రద్ధగా ఆలకిస్తున్నాడు. వారు అతనిని ఒక మనిషిగా చూడకుండా, అతని గురించి ఏమీ పట్టించుకోవడం లేదు.

### వ్యక్తులు:

రాజనీతి కోవిదుడు, రచయిత, శాస్త్రవేత్త, కళాకారుడు, పారిశ్రామికవేత్త, వ్యాయామ క్రీడాకారుడు, అజ్ఞాతవ్యక్తి

త్రాగునీరు అయిపోతున్నది, సరుకులు నిండుకుంటున్నాయి. భౌతికంగా వారి బాధ భరించశక్యం కాకుండా ఉంది. కనుచూపు మేరలో ఎటువంటి ఆశా కాన రావడం లేదు. మత్యువు సమీపిస్తున్నది. వారు వారి మనస్సులను ఈ దీనావస్థ నుంచి తప్పించటానికి, ప్రతి ఒక్కరు తమ వంతు వచ్చినప్పుడు తమ జీవితగాథను చెపుతున్నారు.

(తెర పైకి లేస్తుంది)

# రాజనీతి కోవిదుడు

మీరు అడిగారు కనుక, ముందుగా నేను నా జీవితం ఎటువంటిదో వివరిస్తాను.

ఒక రాజకీయవేత్త కొడుకుగా, నాకు చిన్నతనం నుంచి ప్రభుత్వ వ్యవహారాలు, రాజకీయసమస్యలతో పరిచయముంది. నా తల్లిదండ్రులు తమ స్నేహితులకు ఇచ్చే విందుభోజనాల సమయాలలో అవన్నీ స్వేచ్ఛగా చర్చించేవారు. నా 12 వ ఏట నుంచి నేనూ వాటికి హాజరయేవాణ్ణి. వివిధ రాజకీయ పార్టీల అభిప్రాయాలు నాకేమంత ఆశ్చర్యం కలిగించేవి కావు. అత్యుత్సాహంతో ఉరకలేసే నా యువ మనస్సు ప్రతి క్లిష్టవిషయానికీ సులువైన పరిష్కారాన్ని కనిపెట్టూ ఉండేది.

సహజంగానే, నా చదువుసంధ్యలు ఆ దారిలోనే వెళ్ళాయి. ఆ విధంగానే నేను రాజకీయశాస్త్రంలో ప్రజ్ఞావంతుడైన విద్యార్థిగా తయారయ్యాను.

ఆ తరువాత చదివినదాన్ని ఆచరించే సమయం వచ్చింది. నేను మొట్టమొదటి తీవ్రమైన యిబ్బందులను ఎదుర్కోనవలసి వచ్చింది; దానితో నాకు వాస్తవికంగా ఒక వ్యక్తి తన భావాలను ఆచరణలో పెట్టడం ఎంత అసాధ్యమో తెలియడం మొదలైంది. నేను వాటితో రాజీ పడవలసి వచ్చింది. క్రమక్రమంగా నేను పెట్టుకున్న గొప్ప ఆదర్శం ఛిన్నాభిన్నమైపోయింది.

జీవితంలో గెలుపుకూ, వ్యక్తి తాహతుకు పొంతన లేదనీ, దాని కంటే పరిస్థితుల కనుగుణంగా ఒక వ్యక్తి తనను తాను మలుచుకునే సామర్థ్యం మీదనూ, తనకు తాను సానుకూలదృక్పథం అలవరచుకోవడంలోనూ మాత్రమే విజయావకాశం ఉందనే విషయం నాకు అవగతమైంది. దానికి అతడు జనుల అపరిపూర్ణతలను సరిదిద్దటానికి బదులుగా వారి బలహీనతలను తప్పనిసరిగా పొగుడుతూ ఉండాలి.

నేను ఎంత ఉజ్వలంగా నా వృత్తిలో పైకిపోయి రాణించానో, ఆ విషయం మీ కందరికీ తెలుసుననే దానిలో నాకు ఎటువంటి సందేహమూ లేదు. అందువల్ల నేను దానిని ప్రస్తావించదలచుకోలేదు. కానీ ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను. నేను ప్రధానమంత్రి అయిన వెంటనే, నా పదవి నాకు ఒక విధంగా నిజమైన అధికారాన్నిచ్చింది, నేను నా యవ్వనంలోని మానవతాదర్శాలను గుర్తు చేసుకున్నాను. వాటి ద్వారా మార్గదర్శకత్వం పొందుతూ వచ్చాను, నేను 'పార్టీ వ్యక్తిని' కాకూడదనే ప్రయత్నమే చేశాను. ప్రపంచాన్ని క్షోభపెట్టే వివిధ రాజకీయ, సామాజిక ప్రవృత్తుల

మితిమీరిన పరస్పర వైరుధ్యాల మధ్య పరిష్కారాన్ని కనుగొనాలని నేను అనుకున్నాను. ఏమైనప్పటికీ, నా ఉద్దేశంలో, వాటన్నింటికీ వేటికుండే ఉపయోగాలు వాటికున్నాయి. ఏదీ సమగ్రంగా మంచిది కాదు, పూర్తిగా చెడ్డదీ కాదు, ప్రతిదానిలోనూ ఉండే మంచిని తీసుకుని తగినవిధంగా మలుచుకుంటూ సామరస్యతాపూర్వకమైన రూపాన్ని కల్పిస్తూ, మొత్తానికి ఒక ఆచరణాత్మక యోగ్యమైన మార్గాన్ని కనుగొనవలసిన అగత్యం ఉంది. కానీ నేను ఈ వైరుధ్యాలను సమన్వయపరచగల ఆ సంయోజక సూత్రాన్ని కనిపెట్టలేకపోయాను. ఇక దానిని ఆచరణలోకి తీసుకురావడమనేదాని గురించి చెప్పేదేముంది.

ఆ విధంగా నేను శాంతినీ, సంధినీ, దేశాల మధ్య సుహృద్భావాన్నీ, అందరి మంచికోసం సహకారాన్నీ కోరుకున్నాను. కానీ నా శక్తి కంటే అధికమైనదాని బలవంతపు ఒత్తిడి వలన యుద్ధం చేయవలసివచ్చింది. అన్యాయమైన పద్ధతుల ద్వారా, కఠినమైన నిర్ణయాల ద్వారా గెలుపును అందుకున్నాను.

కాని నన్ను అందరూ రాజనీతికోవిదుడుగా అనుకుంటారు, వారి గౌరవమర్యాదలు, పొగడ్తలలో నేను తలమున్కలైపోయాను. జనులు నన్ను 'మానవజాతికి స్నేహితుడు' గా పిలుస్తారు. నా చిన్నతనంలోని అందమైన ఆశయాలను సఫలీకృతం చేసుకోవటానికి కావలసిన నిజమైన జ్ఞానమూ, ఆధిపత్యశక్తీ నాకు లేవనే సంగతి నాకు తెలుసు.

ఇక ఇప్పుడు అంతిమ ఘడియ సమీపిస్తున్నది . నేను చేసింది చాలా తక్కువ అనీ, చెప్పాలంటే అదీ చాలా తప్పుల తడక అనీ, నేను అనుకుంటున్నాను. ఇప్పుడు చాలా విచారంతో, భ్రాంతులు తొలగిపోయి, మృత్యుకుహరంలో ప్రవేశిస్తున్నాను.

మూలం: శ్రీమాత

అనువాదం: త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

# రచయిత

భావగర్భితములైన పదాలతో మన మృత్యుగ్రస్త జీవితంలోని సౌందర్యం, స్తయం ప్రహర్ష స్పందనలను పట్టి బంధించ కాంక్షించాను. మన కళ్ళ ఎదుట, క్షణ క్షణం మారుతూ సాక్షాత్కారించే సృష్టి అందాలు — మనుష్యులు, అల్పజీవులు, వస్తువులు, జీవులు, దృశ్యాలు, సంఘటనలు, ఇంకా ఇతరములు — వాటితో సమానంగా, మన అనుభూతుల్లో, అవగాహనల్లో సాక్షాత్కారించేవి; ఇవన్నీ కలిసి మన చైతన్యంలో, ఒక విచిత్రమైన, నిగూఢమైన అల్లిక — ఒక సాలెగూడు — తికమకపెట్టే ఒక సంక్లిష్ట సంపుటం అవుతుంది. అవి వేశాయి నాపై ఒక గంభీరముద్ర; అవి పిలుస్తున్న, గొంతు విన్నా — వాటిని తెల్పుకోమని — అర్థం చేసుకోమని, పట్టుకోమని పిలిచే వాటి గొంతు — ఏజియన్ శంఖారావం కన్న ఎక్కువ తీయని, ఎక్కువ బలంగా బలాత్కారించే — వాటి గొంతు పిలుపు విన్నా; ఆ గొంతు ధ్వనిని, నా పదాల కందించే ప్రయత్నం చేశా.

గురిపెట్టాను నేను — ఈ వస్తువుల రహస్యాన్ని ఉచ్చరిద్దామని, 'స్ఫినిక్స్' చే మాట్లాడిద్దామని. ఏది దాగి వుందో, ఏది పూర్తిగా మూసి ఉంచబడిందో, ఏది సూర్యులను, నక్షత్రాలను, హృదయాలను, తన రహస్యస్థితి నుండి కదలిస్తుందో — ఆ రహస్యానికి తెర లేపి — పట్టపగటి కాంతిలో, బట్టబయలు చేయడానికి ప్రయత్నించా. జీవుల శ్రమ భూమిపై జీవితానికి సంబంధించినా పైలోకాలకు సంబంధించినా, అది ఒక మూగ, అంతేకాదు, అయోమయానికి గురిచేసే మూకాభినయానికి వాక్సుద్ధిని, చేతనను అందజేశా. పదాలు కనబడ్డాయి నాకు — ఒక అద్భుతమైన పనిముట్టుగా — సర్వోన్నతమైన నిపుణతగల పనిముట్టుగా, దానికున్నది తగిన నిబద్ధత, రూపమివ్వడానికి, ప్రకటించడానికి, అవి పూర్తిగా ద్రవంగా స్పష్టమైన రూపం లేనివీ కాదు లేదా పూర్తిగా అపారదర్శకంగానూ ఉండవు. పదం ఒకేమారు రెండు ప్రపంచాలకు చెందుతుంది. అది ద్రవ్యప్రపంచానికి చెందినది కావున, ద్రవ్యరూపాన్ని ఇస్తుంది. అది కావల్సినంతగా ద్రవ్యరహితం కావున సూక్ష్మవస్తువులు, శక్తులు, కంపనాలు, సూత్రాలు, భావాలతో సంబంధం కల్గి ఉంటుంది. అది ద్రవ్యంకాని వాటిని ద్రవ్యంగా, దేహం లేనిదానిని, దేహంతో వున్నదిగా చేయగలదు. అన్నిటి

కంటె ముఖ్యంగా అది వస్తువుల అర్థాన్ని, రూపంలో ఇమిడివున్న కచ్చితభావాన్ని ఇవ్వగలదు.

నా కవితలలో వెలికితీసే ప్రయత్నం చేసా — మనిషిలో, ప్రకృతిలో, వాని హృదయవేదన, ఆక్రందన, వాని కన్నీళ్లు, ఏడుపు, దేనికొరకో, ఇంకా విస్తృత ప్రణాళికలో — పురాణగాథలు, నీతికథలు ద్వారా — వివిధ జీవిత క్రియారూపాలు, ఉద్వేగాలు; అరుదైన వివేకం, సామాన్య తెలివితక్కువతనాన్ని చిత్రించా. మనిషి మరియు ప్రకృతి ఎరుకకు సంబంధించి — చారిత్రక సంఘటనలకు — స్పందనతో కూడిన ప్రాముఖ్యాన్ని, అర్థవంతమైన స్పష్టతను — ఇచ్చా; సుఖాంత మరి దుఃఖాంత జీవితాలను నాటకరూపంలో కూడ మలిచా; ఆధునిక మనస్తత్వం యొక్క కోరికలను, అవసరాలను — ఈ పురాతన రూపాలు ఎంత గొప్పగా తీర్చగల్గాయో, వాటికి మీరెంత ఆనందించారో చెప్పడం నా వంతు కాదు. నేను మలిచాను వాటిలో — జీవిస్తూ వున్న శక్తుల పాత్రలలో — మరువలేని వ్యక్తిత్వాలు, రూపాలు.

ఒక విస్తృతమైన, ఇంకా ఎక్కువ సూటి అయిన పనిముట్టు, నవల. ఈనాటి శాస్త్రపరిశోధనా మనస్తత్వానికి, బహుశా, ఇది అనుగుణంగా ఉంటుంది — సోదాహరణంగాను, వివరణాత్మకంగాను ఉంటుంది. వీటిలో వ్యక్తులు, సాంఘిక గణాలు — వాని జీవితచరిత్రను మీ కందించాను. మొత్తం మీద మానవజాతి బృహత్తర సమాజం యొక్క వలయాకార భ్రమణాలు, ముడుచుకుపోవడాలు, ఆరోహణాత్మక ఉద్యమాల జీవిత చరిత్రకు సంబంధించిన దేన్నైనా కొంత మీకందించాలనీ ప్రయత్నించాను. నాకు తెల్సు, నేననుభూతి చెందా — కేవల వ్యాప్తి, విశాలత్వం, విస్తృత సర్వసామాన్యత, మానవాత్మకు సరిపోవు. దాని అవసరం — అభ్యుదయం, గొప్ప శైలి. అందుకే ఇచ్చా నీకు నా మహాకావ్యాన్ని. అది నిజంగా ఒక జీవితకాల శ్రమ. మీలో చాలమందికి అర్థం కాదు, అర్థం చేసుకోలేరు. ఎక్కువమంది ఎక్కువగా సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. కాని అందరూ అనుభూతి చెందారు, దాని మాంత్రిక కంపనాలను. అవును. అది నా ప్రయత్నం — తెరను చించివేయాలనే ప్రయత్నం; పూర్తిగా తెగించి చేసిన నా ప్రయత్నం.

ఇతివృత్తాన్ని మార్చా, పద్ధతి మార్చా. పదాలతో ప్రయోగాలు చేశా — నిపుణతగల శాస్త్రజ్ఞుని వలె. నాకు తెల్సు వాటి అమరికను ఎలా మార్చాలో, వాటినెలా పరివర్తన చేయాలో. కొత్త భావాన్ని, స్వరాన్ని, విలువను, అవి మోసుకుపోయే

టట్లు చేయడం ఎలాగో నాకు తెలుసు. సిసిరో సాహసం, మిల్టన్ విస్తృతపరిధి, రెసిన్ — సామరస్యతను ప్రయోగించగలను, ఇచ్ఛానుసారంగా. వర్డ్స్‌వర్తు నిరాడంబరతను ప్రకటించలేనివానిని కాదు. నాకు ఏమీ తెలియని షేక్స్పియరు ఇంద్రజాలాన్ని ప్రకటించలేని అసమర్థుడిని కాదు. వాల్మీకి ఔద్ధత్వం, వ్యాసుని మహోదాత్త శిఖరాలు — మరీ ఎత్తైనవి కావు, నేనధిరోహించుటకు.

అయినా నేనేమీ సాధించలేదు; సంతృప్తి చెందలేదు. నేను సుఖంగా లేను. ఇంతా చేస్తే — ఇవన్నీ, నే సృష్టించిన కలలు మాత్రమే — 'గాలిలోకి వెదజల్లిన నా కలలు, జీవుల అంతరాత్మ సౌందర్యాన్ని గాని, వాటి వెనుకగల యదార్థ సత్యాన్ని కాని, నే తాకనైనా తాకలేదు. వాని ఉపరితలాన్ని మాత్రమే స్పృశించగలిగానని నా కన్పిస్తోంది. నేను ముద్దాడా — ప్రకృతి ధరించిన బాహ్యవస్త్రాన్ని మాత్రమే. కాని ఆమె స్వీయ ఆత్మ అసలైన శరీరం, తప్పించుకున్నవి, నా నుండి. నేను అల్లా ఒక సాలెగూడును మాత్రమే — సృష్టి అంగాల చుట్టూ; ఎంత సత్యంగా కన్పిస్తుందో తెలియదు. ఆనందదాయకంగా అన్పిస్తుందో తెలియదు. ఈ సాధనం — ఈ పనిముట్టు — ఒకప్పుడు నేనెంత లోపం లేనిది, పరిపూర్ణము — బాగా లోనికి చొచ్చుకుపోయి, ఎరుకపర్చి, ప్రకటించి రూపునివ్వగలదని, తలంచినప్పటికీ — చివరకు నే కనుగొన్నా — అది నా నమ్మకాన్ని వమ్ము చేసినట్లు. చిట్టచివర నేనాలోచించా — వస్తువుల హృదయాలకు దగ్గరగా ఉంచేది — ఒక గొప్ప నిశ్చల నీరవత కేవల మౌనం, అని.'

ఈ నిరంతర చలనంలో, ఈ అసంఖ్యాకంగా మారిపోతున్న స్థితుల్లో, నా నిస్సహాయ చేతులు చాచి — అరుస్తా — ఫాసస్ వలె — "ఎక్కడ, ఎక్కడ, నిన్ను పట్టుకోను — ఓ అనంత ప్రకృతీ." ఇంకో గొప్ప కవి, ఒకప్పుడిలా పోల్చారు — "ఒక నిష్ప్రయోజక దేవత, తన కాంతివంతమైన రెక్కలను — ఏ ఫలితం లేకుండా — శూన్యంలో టపటప లాడిస్తోంది". మన జాతి యావత్తు అంతకంటె గొప్పగా ఏమీ లేదు.

నా జీవితపు చివరి అంచున — నేనడుగుతా, ఒక అజ్ఞాన బాలుని వలె —దీనంతటికి అర్థమేమిటి? అని. ఏ దేవుని ముందు మేము మోకరిల్లి నివేదించుకోవాలి? షెకీనా దర్శించినది ఎలా ఉంది? ఎందుకు జీవించాం, ఎందుకు చావాలి? ఈ భూమిపై కొంత కాలం కనబడి, కనుమరుగవడంలో అర్థం ఏమిటి? ఈ ప్రయత్నాలు, పోరాటాలు,

గెలుపు — దానితో సరితూచబడ్డ అధిక బాధలు — వీని అర్థం ఏమిటి? గొప్ప ఆశలు, ఉరకలు వేసే ఉత్సాహం — ఇదంతా దారి తీసేది — అజ్ఞానపు అగాధం లోనికేనా — ఎరుకలేని, ఏదీ నింపలేని, అజ్ఞానపు అగాధంలోకేనా? తర్వాత తప్పని సరిగా వచ్చే చివరి ఘట్టం — అదృశ్యమవడం, క్షయం కావడం, ఇది కనబడడం కన్న ఎక్కువ నిగూఢమైనది. ఇది అసంబద్ధం, చెడు హాస్యం, భయంకరం, జుగుప్సా కరం, నిరుపయోగం అనే భావన కల్గిస్తోంది.

మూలం: నళిని

అనువాదం: యస్. వై. సోమయాజులు

## ది సైంటిస్ట్

మీలో కొందరివలె నేను నా తోటి మానవుల పరిస్థితులను మెరుగుపర్చాలన్న ఉద్దేశ్యంతో నా జీవితాన్ని ప్రారంభించలేదు. కార్యాచరణ కన్న జ్ఞానమె నన్నెక్కువ ఆకర్షించిన విషయం — జ్ఞానమె ఆధునిక వేషంలో శాస్త్రిజ్ఞానంగా పిలవబడుతోంది. అదృశ్యంగా ఉన్న ప్రకృతి యొక్క రహస్యాల తెరలను తొలగించి, దాగిన ఆ మూలాలను తెల్సుకోగగలగడమంత అద్భుతమైన విషయం మరొకటి లేదు. బహుశ నాకు తెలీకుండానే జ్ఞానం పెరిగితే దాని ఫలితంగా శక్తి పెరుగుతుందన్న సిద్ధాంతాన్ని ఊహించుకున్నాను. ఆ విధంగా ప్రకృతి మీద మనం నూతనంగా సాధించిన ఆధిపత్యం ఇప్పుడో, ఇక ముందో మనిషి యొక్క నైతిక, భౌతిక పరిస్థితిని అభివృద్ధి చేసి, అతని సౌఖ్యానికి దోహదం చేస్తుందని నా ఆలోచన. విజ్ఞానశాస్త్రి పునాదులు వేసిన గత శతాబ్దానికి చెందిన యోచనాపరులతో బాటు, నాకు కూడా అజ్ఞానం ప్రధాన ఏకైక శత్రువు. ఈ అజ్ఞానం వల్లనె మానవునిలో పరిపూర్ణత వైపు సాగే ఉత్సాహం మరీ వెనక్కి తగ్గింది. ఏ చర్చలు లేకుండానే మానవజాతి నిరంతర పరిపూర్ణత్వం సాధించాల్సిన ఆవశ్యకతని అంగీకరించాం. వారు సాధించే ప్రగతి శీఘ్రంగా ఉన్నా, నెమ్మదిగా ఉన్నా ప్రగతి వైపు సాగుతున్నారన్నది మాత్రం నిజం. ఇంతదాకా వచ్చాం కాబట్టి ఇంతకన్నా ముందుకు పోగలం అన్న ధీమా ఉంది. ఎక్కువ జ్ఞానం అంటే మన అర్థం మరింత ఎక్కువగా విషయాన్ని అర్థం

చేసుకోవడం, మరింత వివేకవంతులుం కావడం, మరింత న్యాయబద్ధంగా జీవించడం – క్లుప్తంగా చెప్పాలంటే మరింత మంచివ్యక్తులుగా తయారవడం.

మేం ధృడంగా విశ్వసించిన మరో సిద్ధాంతం ఉంది: అది ఈ విశ్వాన్ని ఉన్నది ఉన్నట్లుగా తెల్సుకోవడం, ఆ నియమాల్ని యధాతథంగా గ్రహించడం. ఇది మనకెంత నిజంగా కనిపిస్తుందంటే దాని ఉనికిని గురించి ఎన్నడూ ప్రశ్నించం. నాకు, ఈ విశ్వానికి రెంటికీ అస్తిత్వం ఉంది. ఇందులో ఒకరు చేయవలసిన పని ఆ రెండవదాన్ని అర్థంచేసుకోవడమే. నిస్సందేహంగా నేను ఈ విశ్వంలో ఒక భాగాన్నే, అయితే ఆ విశ్వాన్ని తెలుసుకునే క్రమంలో, నేను దాన్నించి విడిపడి ఉన్నది ఉన్నట్టుగా చూస్తాను. నేను ప్రకృతి నియమాలని పిలుస్తున్నవాటికి, నా నుంచి, నా మనసు నుంచి భిన్నమైన స్వతంత్రమైన ఉనికి ఉంటుందని అంగీకరిస్తాను. అవి స్వీయ అస్తిత్వం కలిగినవై మరే గ్రహించగల మనస్సుకైనా ఒక్కలాగే ఉంటాయి.

నేను నా పనిని ఈ శుద్ధజ్ఞానం అన్న ఆదర్శ ప్రేరణతో ప్రారంభించాను.నేను భౌతిక శాస్త్రజ్ఞానాన్ని ప్రత్యేకించి అణువు గురించి అధ్యయనంలో రేడియోధార్మికశక్తిని ఎన్నుకున్నాను. ఈ విభాగంలో అప్పటికె బెక్వెరెల్ (Becorwerel) మరియు క్యూరిలు (Curies) ఒక రాజమార్గం తయారుచేశారు. ఆ సమయంలోనె కృతకంగా తయారైన రేడియోధార్మిక శక్తి, సహజ రేడియోధార్మికశక్తిని మించిపోయింది. అప్పుడే పరుసవేదుల కలలు నిజమయ్యాయి. యురేనియం విచ్ఛేదాన్ని కనిపెట్టిన గొప్ప భౌతిక విజ్ఞాన శాస్త్రజ్ఞునితో పనిచేశాను. ఆ విధంగా అణుబాంబు పుట్టుక చూశాను. అది ఏళ్ళ తరబడి చేసే కఠినమైన, మొండిదైన, ఏకాగ్రతతో చేసే శ్రమ. ఈ సమయంలోనే నాలో ఒక ఆలోచనకు రూపకల్పన జరిగింది. అదే నా మొదటి ఆవిష్కరణకు దారి తీసింది. దాని వల్లనే మనం ఈ రోజు అణుశక్తితో విద్యుచ్ఛక్తిని తయారుచేయ గలిగినది. మీ అందరికీ తెలిసినట్టుగానే ఈ ఆవిష్కరణ ఫలితంగా మొత్తం ప్రపంచం యొక్క ఆర్థిక పరిస్థితిలో విప్లవాత్మకమైన మార్పు వచ్చింది. దాని వల్లనే తక్కువ ధరతో విద్యుచ్ఛక్తి అందరికి అందుబాటులోకి వచ్చింది. ఇది మానవుడికి చెమటోడ్చి తన ఆహారాన్ని సంపాదించుకునే అవసరాన్నించి, మానవుడిపై మోపబడిన శ్రమ అనే శాపాన్నించి అతనికి స్వేచ్ఛ నిచ్చింది. అందువల్లే ఆ ఆవిష్కరణ చాలా సంచలనం కల్గించింది.

ఆ విధంగా నేను యువకుడిగా ఉన్నప్పటి నా కలను నిజం చేసుకున్నాను. ఓ

గొప్ప ఆవిష్కరణతో పాటు, మానవులకు అది ఎంత ముఖ్యమో కూడా చూశాను. ఆ విధంగానే నేను ప్రయత్నపూర్వకంగా కాకపోయినా ఓ గొప్ప కానుకను మానవాళికి అందించాను.

ఇది నేను పూర్తిగా తృప్తిపడగల కారణమే, కాని ఆ తృప్తి ఎంతో కాలం నిలువలేదు. నేను ఇప్పుడే ఇదంతా చెప్పగలను — ఎందుకంటె మనం ఇప్పుడు మృత్యువుకి చాలా సన్నిహితంగా ఉన్నాం. నా రహస్యం నాతోనె పూడ్చబడుతుంది, అందుకే చెప్తున్నాను. దీని తరువాత, నేను స్వేచ్ఛగా అణుశక్తిని యురేనియం, థోరియంతో పాటు మరికొన్ని అరుదైన లోహాలతో పాటు సామాన్య లోహాలైన రాగి, అల్యూమినియంల నుండి కూడా విడుదల చేయవచ్చని కనుక్కున్నాను. కాని అప్పుడు నా మీద విరుచుకుపడిన ఓ విస్మయం కల్గించె సమస్యను ఎదుర్కొన్నాను. అది నేను నా ఆవిష్కరణని బహిరంగపరచవచ్చా అన్నది? కాని ఈ రోజు వరకు ఈ రహస్యం నాకు తప్ప ఎవరికి తేలీదు.

మీ అందరికి అణుబాంబు కథ తెలుసు. అది మరెన్నో రెట్లు విధ్వంసకరమైన హైడ్రోజను బాంబుకి దారితీసిందని మీకు తెలుసు. ఈ నూతన ఆవిష్కరణలు మానవజాతి చేతుల్లో అసమానమైన విధ్వంసకశక్తిని పెట్టాయని, వాటి ప్రభావం క్రింద మానవులు తడబడుతూ నడుస్తున్నారని నాకు తెల్సినట్లే మీకూ తెలుసు. కాని నేనిప్పుడు నా నూతన ఆవిష్కరణా రహస్యాన్ని బయటపెడితే, నేను ఈ ప్రమాదకరమైన శక్తిని ఎవరో ఒకరి చేతుల్లో పెట్టినట్లే. అప్పుడు ఏ అడ్డూ అదుపూ లేకుండా ప్రభుత్వాలు యురేనియం, థోరియయములపై గుత్తాధిపత్యాన్ని స్థాపించుకొంటాయి. మొదటి కారణం, అవి చాలా అరుదుగా లభిస్తాయి. కాని ఇంకా చెప్పాలంటే వాటి రేడియోధార్మికశక్తిని అధికంగా విడుదలచేసేట్లు చేయడం, ఉపయోగించడంలో ఉన్న కష్టం కారణం. ఒక అణ్వాయుధం చేస్తే — ఓ పారిస్‌నో, లండన్నో, న్యూయార్క్‌నో నామరూపాలు లేకుండా విధ్వంసం చేయగల సామర్థ్యమున్న ఆయుధాన్ని తయారుచేస్తే అది మానవజాతినే మట్టుపెట్టే దెబ్బ కదా? అందువల్ల నా ఆవిష్కరణ భారం కింద నేనూ నలిగిపోయాను. చాలా కాలం సంధిగ్ధంగానే గడిపాను. నా హేతుబుద్ధికి, హృదయానికి సంతృప్తి కలిగించే నిర్ణయం ఇంకా తీసుకోలేకపోయాను.

ఆ విధంగా ఒక యువసైంటిస్ట్‌గా ప్రకృతి రహస్యాలు కనిపెట్టే పరిశోధనలోని

నా మొదటి సిద్ధాంతం ముక్కలైంది. జ్ఞానం పెరిగితే దానితో కొంత శక్తి పొందవచ్చు, అంతేకాని అది మానవజాతిని మంచిమార్గాన నడిపించడంలో సహాయపడదు. దాని పర్యవసానం మానవులను మరింత సన్మార్గం వైపు తిప్పడానికి మార్గం చూపదు. శాస్త్రవిజ్ఞానంలో అభివృద్ధి సాధిస్తే దాని అర్థం తప్పనిసరిగా నైతికాభివృద్ధిని సాధించామని కాదు. శాస్త్రీయమైన, మేధోపరమైన జ్ఞానానికి మానవ స్వభావాన్ని మార్చగల శక్తి లేదు. అయినా ఇప్పుడు మానవస్వభావంలో మార్పు యొక్క అవసరం, వారి మీద వత్తిడి కలిగిస్తోంది. మానవులకు దురాశ, తీవ్ర ఇచ్ఛ ఇప్పటికీ రాతియుగం నాటి మానవునిలో ఉన్నంత తీవ్రంగానే ఉన్నాయంటే, దాని అర్థం మానవజాతి శాపగ్రస్తమైందని. మనం ఇప్పుడు ఒక కీలకమైన మలుపు దగ్గర ఉన్నాం, ఒక శీఘ్రమైన, విప్లవాత్మకమైన, నైతిక పరివర్తన చెందకపోతే, మానవులు తమ చేతుల్లో ఉన్న శక్తితో స్వయంగా తమని తాము నాశనం చేసుకుంటారు.

నా యువదశలోని రెండవ సిద్ధాంతాని కేమైంది? నాకు కనీసం శుద్ధజ్ఞానం దొరికిన ఆనందమైనా ఉందా! నేను ప్రకృతి యొక్క యంత్రాంగంలోని రహస్యాలను కొంతైనా పట్టుకోగలిగానన్న (నిశ్చింత) స్పష్టత నాకుందా? ప్రకృతిని పాలించే వాస్తవమైన నియమాల గురించి అర్థం చేసుకున్నానన్న ఆశతో ఆనందించగలనా? అయ్యో! ఇక్కడ కూడా నా ఆదర్శం విఫలమైందని నా భయం. ఒక సిద్ధాంతం, సత్యం లేక అసత్యం అని చెప్పే భావాన్ని శాస్త్రవేత్తలమైన మేము ఎప్పుడో పక్కన పెట్టాం. ఇప్పటి వాస్తవాలను బట్టి చూస్తే ఆ సిద్ధాంతం చక్కగా వర్తిస్తుంది. వాస్తవాలకు ఆచరణాత్మంగా వివరణ యిస్తుంది అని మాత్రం చెపితే ఏ యిబ్బందీ వుండదు. కాని అది సత్యమో కాదో తెలుసుకోడానికి అంటే వాస్తవానికి అనుగుణంగా ఉన్నదా లేదా అన్నది మరో విషయం. బహుశ ఆ ప్రశ్నే అర్థం లేనిది. నిస్సందేహంగా నేను చెప్పేదేమిటంటే మరో కోణం నుంచి చూసిన సిద్ధాంతాలున్నాయి. అవి కూడా తప్పనిసరిగా అవే వాస్తవాలను అంతే సమర్థనీయంగా వివరించాయి, అందుచేత అవి కూడా సరి అయినవే అని చెప్తాను. అసలు ఏమిటీ సిద్ధాంతాలు? అవి కేవలం ప్రతీకలు మాత్రమే. అవి మనకు పరిశోధనలో, ఆవిష్కరణలో ముందుగా సూచన లిచ్చి సహాయం చేస్తాయి కనుక తప్పనిసరిగా ఉపయోగకరమైనవే. అయితే అవి విషయాలు ఎలా సంభవించగలవో చెప్పవచ్చు కాని, ఎందుకు, ఎందు నిమిత్తం అన్నది చెప్పలేవు. అని మన్ని నేరుగా వాస్తవం దగ్గరకు చేర్చలేవు. ఆ క్రమం

చూస్తున్నపుడు మనకి ఆ సత్యాన్ని, ఆ వాస్తవాన్ని చేరడానికి, దాని చుట్టూ తిరుగుతూ, అనేక భిన్నకోణాల నించి, భిన్న దృక్పథాలనించి దాన్ని చేరడానికి ప్రయత్నిస్తూ ఉండి, ఎన్నటికీ ఆ వాస్తవాన్ని కనిపెట్టడం కాని, గ్రహించడం కాని చేయలేరన్న భావం కల్గుతుంది, లేదా అది కూడా బయటకొచ్చి తనను తాను వెల్లడించుకోదు.

మరో వైపు మనం కల్పించుకుని, మనం వేసిన లెఖ్ఖలతో ఆ దృశ్యప్రపంచం గురించి మనకి అవి వివరించాలని ఆశపడతాం. నిజానికి మనం లెఖ్ఖలు కట్టే ఆ ప్రయత్నంతోనే దాన్ని అత్యంత స్వల్పంగానైనా చెదరగొడతాం. ఆ బాహ్య సంతులనాన్ని చెడగొట్టి దానివల్ల ప్రపంచంలోని ఒక అంశాన్ని మారుస్తాం. అందువల్ల ఈ గణాంకాలన్నీ మనకిచ్చేది ఖచ్చితమైన జ్ఞానం కాదు. వాటి నుంచి మనం రాబట్టగలిగేది సుమారుగా అంచనా వేయడం మాత్రమే, స్పష్టంగా చెప్పడం కుదరదు. ఈ సిద్ధాంతపరంగా మనం కొలిచినపుడు మనం స్వయంగా వేసే లెఖ్ఖల్లో ఈ నిశ్చయంగా చెప్పలేనిది స్వల్పమే, కాని అత్యంత సూక్ష్మమైన అణువుల ప్రపంచంలో అది ఆ విధంగా ఉండదు. ఇక్కడ మనలోని ముఖ్యమైన అసమర్థత ఒక అవరోధం, దాన్ని అధిగమించగలం అని ఎప్పుడూ ఆశపడలేం. అది విషయాల యొక్క స్వభావంవల్ల తప్ప మన పరిశోధనా పద్ధతుల్లోని అసంపూర్ణత్వం వల్ల కాదు, మనం మన రంగు కళ్ళద్దాలను తీసి విశ్వాన్ని అధ్యయనం చేయడంలో ఎన్నటికీ విజయవంతం కాలేం. నా లేఖలు, నా సిద్ధాంతాలు నా మానవ మనస్సులో ఉన్నవే, అవి ఎంత విశ్వాసాన్ని చూడగలవో అంతే భాగాన్ని పొంది ఉంటాయి. అవి వ్యక్తిగతమైనవి బాహ్యంలో దర్శించేవి, నిజానికి అవి బహుశ మన మనస్సులో మాత్రమే ఉన్నాయేమో.

అనంతం యొక్క తీరాలలో నేనొక పాదముద్ర చూశాను. ఆ ఇసుక మీద ముద్రను వదిలిన అతడి రూపాన్ని తిరిగి నిర్మించాలనుకున్నాను. అది నేనే అని కనుక్కోడంలో చిట్టచివరికి విజయం సాధించాను. ఇక్కడే నేను నిలబడినది — మనం అంతా నిలబడి ఉన్నది — నాకు మరో దారి కానరాదు.... ఈ ప్రపంచం గురించి నాకేమీ ధృడవిశ్వాసాలు లేవు, ఉన్నవి సంభావ్యతలు మాత్రమే. అదే ఒక ఆశాకిరణాన్ని చూపిస్తోంది. అదే మానవాళి భవిష్యత్తుపై పూర్తిగా ముగింపు సీలువేయ లేదన్నది.

మూలం: పవిత్ర

అనువాదం: శ్రీమతి డి. సత్యవాణి

# కళాకారుడు

కళను బ్రతుకు తెరువు కోసం కాక, ఒక వినోదకలాపంగా తీసుకొంటారనీ, కళాకారులంటే వేశ్యాలోలురని, ధనాన్ని ఏమాత్రం లక్ష్యపెట్టరని, వారసలు నమ్మదగినవారు కాదని గట్టిగా భావించే పరువుమర్యాదలు కల మధ్యతరగతి కుటుంబంలో పుట్టినా... కళా కారుడిని అవ్వడానికి ఒక బలీయమైన అవసరం నాలో కల్గింది. నా పూర్తి చేతన నంతా నా కళ్ళల్లో కేంద్రీకరించి మాటలతో కంటే కూడా తేలిగ్గా నన్ను నేను నా చిత్రాల ద్వారా వ్యక్తపరచుకోగల్గాను. పుస్తకాలు చదవడం ద్వారా కంటే బొమ్మల్ని చూస్తూ వుండటం ద్వారానే ఎక్కువ నేర్చుకొన్నాను. నేనొక్కసారి చూచిన, దృగ్గోచర విశాలసీమల్ని, మనుషుల ముఖాలను, రేఖాచిత్రాలను నేనెప్పటికీ మరిచిపోను.

నాకు పదమూడేళ్ళ వయస్సులో ఎంతగానో ప్రయత్నించి, చిత్రలేఖనంలోని మెళకువల్నీ, జలవర్ణ, తైలవర్ణ, రంగు కణికెలతో చిత్రాలను వేయడంలో పట్టునూ సాధించాను. అప్పుడు నా స్నేహితుల కోసం, మా తల్లిదండ్రులకు తెలిసినవారి కోసం కొన్ని బొమ్మలు వేసే అవకాశం నా కొచ్చింది. కొంచెం కొంచెంగా డబ్బు సంపాదించుకోవడంతో మా తల్లిదండ్రులు కూడా దీనిపై మరింత శ్రద్ధ పెట్టడానికి ప్రోత్సహించడం మొదలుపెట్టారు. దీనిని ఆసరాగా తీసుకొని నా చదువును, చదవగలిగినంతదాకా కొనసాగించాను. చేరేందుకు తగిన వయస్సు వచ్చేవరకు ఆగి ఫైన్ ఆర్ట్స్ స్కూల్లో చేరాను. వెంటవెంటనే చిత్రలేఖన పోటీల్లో కూడా పాల్గొ న్నాను. చిత్రలేఖనంలో ఎంతో ప్రతిభావంతుల కిచ్చే ప్రి-ద-రోమ్ అనే బహుమతి గెలుచుకొన్న, అతి చిన్న చిత్రకారుడిని నేనే. ఇది నేను బాగా లోతుగా ఇటాలియన్ చిత్రకళను అధ్యయనం చేయడానికి బాగా దోహదపడింది. తరువాత విదేశాల్లో పర్యటించి అధ్యయనం చేయడానికి లభించిన ఉపకార వేతనాలు స్పెయిన్, బెల్జియం, హాలండ్, ఇంగ్లాండు, ఇంకా ఇతర దేశాలు సందర్శించడానికి నాకు అవకాశాన్ని కల్పించాయి. నేనొక చిత్రలేఖనా విధానానికి, ఒక పరిమిత కాలానికి చెందినవానిగా ఉండాలని నేనెన్నడూ అనుకోలేదు. అన్ని దేశాలవారి చిత్రకళను, అన్ని శైలీరూపాల్లో ప్రాక్పశ్చిమ దేశాల చిత్రకళలను నేను అధ్యయనం చేశాను. అదే సమయంలో నాదయిన శైలిలో నా చిత్రసృజనలో తారస్థాయికి చేరుకొన్నాను, ఒక నూత్న శైలిని కనుగొనడానికి ప్రయత్నించాను. కీర్తి, కార్యసిద్ధులు చేకూరాయి. చిత్ర

ప్రదర్శనల్లో ప్రథమ బహుమతులను గెలుచుకొన్నాను. సభల్లో పాల్గొన్నాను. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధిచెందిన చిత్రప్రదర్శనశాలల్లో నా చిత్రాలను ప్రదర్శించారు. ఆయా చిత్రవ్యాపారులు వాటిని చకచకా కొనుక్కుపోయేవారు కూడా. అవి నాకు సంపదను, ఖ్యాతిని, ఆదరణను తెచ్చిపెట్టాయి. 'ప్రతిభాశాలి' అని పిలిపించుకొన్నాను. కానీ... నేను సంతృప్తి చెందలేదు. నేను అనుకొనే 'ప్రతిభ' కు అర్థం పూర్తిగా భిన్నమైనది. మనం క్రొత్త రూపాలను సృష్టించాలి. క్రొత్త పద్ధతులను, క్రొంగొత్త విధానాలలో, ఉన్నతమైన, విశుద్ధమైన, నిజమైన బహు ఉదాత్తమైన నూత్న సౌందర్యాన్ని అభివ్యక్తం చేసే నిమిత్తం మనం నవీన రూపాలను సృజించాలి. ఈ పాశవిక మానవీయతకు బద్ధుడినై వున్నట్లు (అదిప్పుడు కూడా) భావిస్తున్నంత కాలం నన్ను నేను పూర్తిగా ప్రాకృతిక పదార్థ రూపాల నుండి విడగొట్టుకోలేను. ఆకాంక్ష అయితే ఉండేది కానీ, దానిని సాధించడానికి తగిన జ్ఞానం, అంతర్దృష్టి లోపించాయి.

ఇప్పుడు చూస్తే మనం చావడానికి సిద్దంగా ఉన్నాం. నేను దేనిని రూపొందించాలని వాంఛించానో దానితో పోలిస్తే నే చేసింది ఏమీ లేదు. నేను దేనిని సృష్టించాలని కోరుకొన్నానో దానితో పోలిస్తే నే సృష్టించింది శూన్యం. ఇంతగా పేరుప్రఖ్యాతులు కుప్పలు తెప్పలుగా వచ్చిపడినా ఇప్పుడు 'నేనొక వైఫల్యాన్ని' అని నా కనిపిస్తోంది.

మూలం: శ్రీమాత
అనువాదం: హర్షవర్ధన్

## పారిశ్రామిక వేత్త

మనం మన హృదయాలు విప్పిచెప్పుకొంటున్నాం గనుక, అంతకంటె నేనేం చెప్పా లనుకుంటున్నానో దాన్ని నా పోటీదారులు లేదా — నా విజయం అని చెప్పుకొనే — నా విజయాన్ని అంగీకరించని వారుపయోగించుకోలేరు గనుక, నా జీవిత కథను మీకు చెప్తాను. యథాతథంగా ఎటువంటి మార్పులూ చేర్పులూ లేకుండా తరచుగా వివరించబడినట్లు గాకుండా నేను చూసింది చూసినట్లు చెప్తాను.

యధార్థ సంఘటలనే చెప్తాను. మా తండ్రి ఒక చిన్న పట్టణంలో కమ్మరి. అతని వారసత్వం వల్ల నాకు కూడా కమ్మరి పని ఇష్టంగా ఉండేది. అతడే నాకు చక్కగా పనిచెయ్యడంలో వుండే ఆనందం తెలిసేటట్లు చేసేడు. చక్కగా పనిచెయ్యడంలో ఆనందమే కాదు ఒక కష్టమైన పనిలో పూర్తిగా లీనమై చేసి ఆ తరువాత దాని వంక తానే చూసుకుంటే కలిగే తృప్తిని కూడా అనుభవించగలగడం నేర్పాడు. నిరంతరం అంతకు ముందు కంటె బాగా చెయ్యాలనే కోరికని కూడా నాలో బలంగా నాటుకునేలా చేసేడు. అంతేకాదు — ఇతరుల కంటె బాగా చెయ్యాల నేది కూడా నేర్పించాడు. లాభాపేక్ష అతడికి ప్రధానం కాదు. మిగిలిన వారందరి కంటె తాను తన వృత్తిలోను, పనితనంలోను ముందున్నానని గర్వపడే విషయాన్ని అతడెప్పుడూ కాదనలేదు. తన పనితనాన్ని చూసి తోటి పట్టణ కార్మికులు ప్రశంసిస్తే త్రికరణశుద్ధిగా పొంగిపోయేవాడు.

ఆ శతాబ్ద ప్రారంభంలో అంతర్దహన ప్రక్రియ వలన పనిచేసే యంత్రం (ఆయిల్ ఇంజను) తయారైంది. దాని మొదటి రూపం కనిపించినప్పుడు అది ఎన్ని సంభవతలకు దారితీస్తుందో గ్రహించి కుర్రవాళ్లమైన మేము ఆశ్చర్యంతో కేరింతలు కొట్టాం. గుర్రం లేకుండా నడిచే బండి అని మొదట్లో చెప్పుకొన్న మోటారుకారును తయారు చేయడం, ఎంతో మహత్తరంగా శ్రమించి సార్థకం చేసుకోవలసిన లక్ష్యంగా మా ముందు నిలిచింది. అప్పటికే తయారై వున్న కొన్ని రకాలేవీ అంత సమగ్రమయినవి కావు.

అక్కడా యిక్కడా సేకరించిన భాగాలతో — అవి ఈ పని కుద్దేశించినవి కాక పోయినా — ఒక కారును తయారుచేశాను. నిస్సందేహంగా అది నాకు నా జీవిత మంతటికీ సరిపడిన అత్యంతానందాన్ని యిచ్చింది. పక్షి సున్నితంగా వాలి కూర్చొ

న్నట్లు అసౌకర్యమైన సీటు మీద జాగ్రత్తగా కూర్చుని మా తండ్రి కర్మాగారం నుంచి టౌనుహాలు వరకు వున్న కొన్ని వందల గజాల దూరం ఆ కారుని నడిపించాను. ఆ సమయంలో విలక్షణమైన ఆ వింత యంత్రం కంటె అందమైనదేదీ యీ ప్రపంచంలో నాకు కనిపించలేదు. అది పోతున్నంత దూరం పెద్ద శబ్దం చేస్తూ, గుప్పు గుప్పున పొగ వదుల్తూ వుంటే ఆ  దారిలో నడుస్తున్నవాళ్ళంతా భయంతో అటూ యిటూ పరుగులు పెట్టారు. కుక్కలు దీనిని చూసి మొరగసాగాయి. గుర్రాలు మోరెత్తి చూస్తూ నిలిచాయి.

ఆ తరువాత గడిచిన సంవత్సరాల గురించీ "బళ్లు లాగడానికి, బరువులు మోయడానికి భగవంతుడు గుర్రాల్ని సృష్టించేడు. రైళ్ళు తయారు చెయ్యడమే దైవం పట్ల అపచారం. అంతకంటె అరిష్టం పట్నంలో రోడ్ల మీద ఈ దారుణమైన యంత్రవాహనాలు తిరగడం" అంటూ ఆవాకులు చవాకులు మాట్లాడే ఛాందసుల అభిప్రాయాల గురించీ కాని నేను చెప్పను. అధిక సంఖ్యాకులు ఈ వింత వాహనానికి భవిష్యత్తు లేదనేవారు. ఇది కేవలం నిపుణులైనవాళ్లు తప్ప సామాన్యులు నడపలేరని అనేవారు. అయితే చాలా కొద్దిమంది సాహసవంతులు నేనొక చిన్న కర్మాగారాన్ని నెలకొల్పుకోడానికి, కొద్దిమంది పనివాళ్ళని పెట్టుకోడానికి, కొంత ముడిసరుకు (స్టీలు) కొనుక్కోడానికి మొదటి పెట్టుబడిగా కొంత ధనసహాయం చేసేరు. ఇదంతా ఎలా కనిపించిందంటే మొట్టమొదట బంగారాన్ని అన్వేషించిన అన్వేషకులు ఏ అంధవిశ్వాసంతో అదృష్ట భ్రాంతితో, తీవ్రవ్యతిరేకత, నిరుత్సాహపరిచే దేశప్రజల మనోభావాల్ని తట్టుకుంటూ ఎలా పోరాడి, ఏకాగ్రతతో పనిచేసేరో అలాగే కనిపించింది. అదే విధంగా నా ప్రయత్నాలు మొదలుపెట్టేను.

నా వరకు చెప్పాలంటే ఎప్పుడూ అదృష్టాన్ని వెతుక్కుంటూ పోలేదు. ఒక మోటారు కారుని తయారు చెయ్యగలిగాననే తృప్తి కోసం మాత్రమే పనిచేసేను. అది అప్పటికి వాడుకలో వున్న వాటన్నిటి కంటె చవకగా, సులభంగా నడపగలిగేది కావాలనుకున్నాను. ఈ రకమైన ప్రయాణసాధనం ఎంతో తక్కువ ఖర్చుతో వుండాలని అనుకున్నాను. ఎందుకంటే అది పనిచేస్తున్నప్పుడు కేవలం దాని చోదకశక్తికి మాత్రమే ఇంధనం ఖర్చు కావాలి. కొనుగోలు ధర కూడ తగినంత తక్కువగా వుండేటట్టు చెయ్యగలగాలి. అందువలన చాలామంది దానిని కొని వుపయోగించుకోగలుగుతారు. ఒక గుర్రాల గుంపుకయ్యే శాశ్వత పోషణ ఖర్చు కంటె యిది బాగా తక్కువగా

వుండి ఆ ఖర్చు ఈ ఖర్చు ముందు సిగ్గుపడేలా వుండాలి.

ఇప్పటికీ నేను అధిక మొత్తంలో ఉత్పత్తి చేసిన మొదటి నమూనా అందరికీ గుర్తుండే వుంటుంది. అది దాని చక్రాల మీద ఎత్తుగా వుండడం వలన కచ్చా రోడ్ల మీద కూడా పోగలిగేది. చాలా దృఢంగా ఎంత మోటుగా వాడినా తట్టుకోగలిగేటట్టు చెయ్యబడింది. అయినా, ఇప్పటికీ కొంతమంది అంటూ వుంటారు, అది ధనవంతులు వాడుకోగలిగేది తప్ప సామాన్యుల కందుబాటులో వుండదని. దాదాపు ఏమీ శ్రమ లేకుండా ఇప్పటికీ ఈ నమూనా కారును నడపడం సులభమే. బొత్తిగా అనుభవం లేని డ్రైవర్లు సయితం కారు నడిపే కాలం ముందు రాబోతున్నదని ఈ నమూనా కారు తెలిపినట్లైంది.

మొదటి ప్రపంచ యుద్ధం జరిగేదాకా గుర్రం మీద మోటారు కారు విజయం సాధించలేకపోయింది. అంబులెన్సులకు, యుద్ధసామగ్రి రవాణా అత్యంత శీఘ్రంగా జరగడానికి యిలా ప్రతి అత్యవసరమయిన పనికి, అసాధారణమైన బరువులు చేరవేయవలసిన ప్రతిదానికీ అమర్చడం జరిగింది. నా కర్మాగారం బ్రహ్మాండమైన వేగాన్నందుకుంది. కుప్పలు తెప్పలుగా ఆర్డర్లివ్వడమే కాక సైన్యం నా కర్మాగారాన్ని అభివృద్ధి చేసుకోడానికి తగిన వనరుల్ని సమకూర్చడమే కాక, సరికొత్త పద్ధతులతో సరుకు తయారీకి అవసరమయిన ధనసహాయం చేయసాగింది.

యుద్ధం ముగిసే సమయానికి నేను యే వడిదుడుకులు లేని సాఫీగా పనిచేస్తున్న కర్మాగారంతో వున్నాను. పౌర అవసరాలకు మించి ఉత్పత్తి చేసే స్థాయిలో వున్నట్లు కనిపించింది. నా సహాయకులు భయపడ్డారు. ఉత్పత్తి రేటు తగ్గించమని, కొంతమంది సిబ్బందిని తొలగించమని తమకు కావలసిన వాటిని సరఫరా చేయమని మేము యిచ్చిన ఆర్డర్లు కొన్ని రద్దు చెయ్యమని, అసలైన అవసరం ఎంత ఉందో కనిపెట్టడానికి కొంతకాలం వేచి చూడమని రకరకాల సలహాలు నాకు చెప్పారు. ఇది తెలివైన పనే. సందేహం లేదు. అయితే ఇప్పుడు ప్రపంచంలో అతి చవుకగా దొరికే కారు తయారుచేసే అరుదైన ఒకానొక అవకాశం దొరికింది. ఉత్పత్తిని తగ్గిస్తున్నామంటే అర్థం ఖరీదుని పెంచుతున్నామని. అందుచేత జనాలు మా వద్ద ఏమి కొనడానికి యిష్టపడతారో దానిని ఉత్పత్తి చేయడం కంటె మేము ఉత్పత్తి చేసినదానిని అమ్మడంలోనే అసలు సమస్య వున్నదని నిర్ణయానికొచ్చాను. ఆరునెలల్లో

బ్రహ్మాండమైన ప్రజ్ఞతో కూడిన వ్యాపార ప్రచారంతో నేను చెప్పింది యధార్ధమని నిరూపించుకున్నాను.

అప్పటినించీ నా కర్మాగారం దాదాపు దానంతటదే ముందుకు పోసాగింది. ప్రధాన నిర్ణయాలు నేను నా క్రింది సహాయకులకే అధికాధికంగా వదిలిపెట్టవలసి వచ్చింది. నేను కేవలం మార్గదర్శక సూత్రాలు నిర్ణయించడం వరకే పరిమితమయ్యాను. ఇవన్నీ సిబ్బంది వేతనాలు తగ్గించకుండా, సరకు వాసి (నాణ్యత) తగ్గకుండా అవి తక్కువ ధరకి వుత్పత్తి చేయడానికి అవలంబించిన మార్గాలు. నిజానికి ప్రపంచంలో అందరి కంటె అత్యధిక వేతనాలు పొందుతున్నది మా కార్మికులే, అవ్వాలి. ఎల్లపుడూ కొత్త మార్కెట్టులకి చేరుతూ వుండడానికి, తక్కువ ధరకి అమ్మడం జరగాలి. కంపెనీ పరిస్థితి తారుమారు కాకుండా కారుచౌకగా అమ్మడానికి లాభాల పరిమితి వీలైనంత తగ్గించడమే కాకుండా ఉత్పత్తి వ్యయం విపరీతంగా పెరగకుండా అవసరమయిన టర్నోవరు సాధించేలా వ్యాపారప్రకటనల్ని తయారు చెయ్యాలి. చివరిగా సాధారణ సరఫరాదారులు మరీ ఎక్కువ లాభం కోరినట్టయితే, నిస్సంకోచంగా మనకి కావలసిన విడి భాగాలు, సగం తయారయి ఆగిపోయిన ఉత్పత్తులు, ఆఖరికి ముడిపదార్థాలు సమకూర్చుకోడం కూడా మనమే చెయ్యాలి.

ఈ నిర్ణయాలతో నా వ్యాపారం ఒక జీవి ఎదిగినట్టు ఎదగసాగింది. నేను పట్టిందల్లా బంగారమయింది. దీనితో దాదాపు నేనొక చారిత్రక పురుషుణ్ణయిపోయాను. కొత్త జీవనవిధానాన్ని సృష్టించగలిగే దైవాంశ సంభూతుడిగా మారిపోయాను. ఇతరులు నన్ననుసరించవలసిన ఆదర్శపురుషుడి నయిపోయాను. నా మాట వేదంగా, నేను చేసినది అదెంత అల్పమైనదైనా గొప్పగా కీర్తించబడింది. నేనేది చెప్పినా అది గొప్ప సిద్ధాంతంగా, ఒక కొత్త సువార్తగా జనాల్లో ప్రచారం చెయ్యబడింది.

ఇందులో వాస్తవం వుందా? ఇందులో అసలు నిజమేమైనా వుందా? నా వ్యాపారం అంతకు ముందు కంటె అభివృద్ధి చెందడం వల్ల బాగా నిలదొక్కుకుంది. దాని యెదుగుదల మీద ఏ రకమైన అదుపు పెట్టాలనుకున్నా ప్రాణాంతక మవుతుంది. సాధారణ ఖర్చులు పెరుగుతున్న ఉత్పత్తి కన్న వెనకబడి ఎంతో దూరాన లేవు. ఆ ఖర్చు లాభపరిమితిని మింగేస్తుంది. మొత్తం టర్నోవరుతో పోలిస్తే అది చాలా స్వల్పం. వ్యాపారం మాత్రం విపరీత వేగంతో యెదిగిపోతున్నది, ఎంతలా ఎదుగుతున్నదంటే ప్రాణమున్న సంపూర్ణ వికాసం వైపు సామరస్యంతో స్థిరంగా ఎదుగుతున్న

శరీరం కంటె వేగంగా యెదుగుతూ, బాగా గాలి కొట్టిన బెలూన్ లాగ తయారైంది. ఉదాహరణకి, కొన్ని విభాగాలు మిగతావాటితో పాటుండడానికి అందులోని కార్మికుల్ని కట్టుబానిసల్లా చూస్తున్నాయి. అవసరమైన యంత్రాలను ఏర్పాటు చేయడం ద్వారా వీలైనంత త్వరగా ఒక చోట సమస్యను పరిష్కరిస్తే మరొక చోట మళ్ళీ అదే సమస్య తలెత్తుతోంది. ఈ పరిస్థితిలో నేను నిస్సహాయుణ్ణయి పోయాను. ఎందుకంటే ఉత్పత్తిలో ఏ చిన్న విఘాతం కలిగినా దాని ఫలితం కేవలం కార్మికుల కష్టాలు యింకా పెరగడానికే దారితీసింది.

మానవాళికి నేను యిచ్చిందేమిటి? మనుషులు ఇంతకు ముందు కంటె సులభంగా ప్రయాణం చేస్తున్నారు. అయితే వాళ్ళు యింతకు ముందు కంటె బాగా ఒకళ్ళ నొకళ్ళు అర్థం చేసుకుంటున్నారా? నా ఆదర్శాన్ని అనుసరిస్తున్నారా? శ్రమని తగ్గించే అనేక రకాల సాధనాలు అత్యధిక సంఖ్యలో ఉత్పత్తయి అత్యధిక కొనుగోలు దారుల కుపయోగపడుతున్నాయి. కొత్త అవసరాలు పుట్టుకొస్తున్నాయి. లాభాల మీద ఆశ యింకా పెరిగిపోతున్నది. అంతకంటె ఎక్కువగా యిది చేస్తున్నదేమైనా వుందా? నా కార్మికులకు ఇతర కర్మాగారాలలో పనివారి కంటె వేతనాలు ఎక్కువగానే ముడుతున్నాయి. అందువల్ల వారిలో ఇంకా ఎక్కువ సంపాదించాలనే కోరిక పెంచడంలో మాత్రమే నేను విజయవంతమయ్యాను. వారు అసంతృప్తితో వున్నట్లు, సుఖంగా లేనట్టే నా క్కనిపిస్తున్నది. వారి జీవన ప్రమాణాలు పెంచడం ద్వారా, వారికి భద్రత కల్పించడం ద్వారా వారిలో మానవతా దృక్పథం, వ్యక్తిగత ఔన్నత్యం పెరుగుతాయని నేనాశించాను. కాని నేననుకున్నదానికి పూర్తి విరుద్ధంగా జరుగు తున్నది. నిజానికి అత్యధిక మానవుల కష్టాలలో మార్పు రాలేదు. అదివరకు ఎలా వుందో యిప్పుడూ అలాగే వుంది. నేననుసరించిన పద్ధతుల వల్ల అవి చక్కబడ లేదు. నా చర్యలు విఫలం కావడానికి ప్రాథమికంగా ఏదో తప్పు జరిగింది. అది అర్థం చేసుకోడంలో నేను విఫలమయ్యాను. ఆ రహస్యమేదో యిప్పటికీ కనిపెట్టవలసి వుందనే నా భావన. దాన్ని కనిపెట్టకుండా మనం ఎన్ని ప్రయత్నాలు చేసినా వ్యర్థమే.

మూలం: ఆంద్రే

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

# క్రీడాకారుడు

ఒక క్రీడాకారుల కుటుంబంలో నేను పుట్టాను. నా తల్లిదండ్రు లిద్దరూ అన్ని రకాల క్రీడలలో, ఆటలలో, శారీరక విన్యాసాలలో మంచి ప్రావీణ్యత గడించినవారు. మా తల్లిగారు ప్రత్యేకించి ఈతకొట్టడంలో, నీటిలో తలక్రిందులుగా చొచ్చుకొనిపోవటంలో విలువిద్య, కత్తిసాము, నాట్యవిద్యలలో మిక్కిలి ప్రవీణురాలు. ఈ శాఖలలో ఆమె ప్రఖ్యాతి పొందటమే కాక పలుచోట్ల ప్రధాన క్రీడాకారిణిగా ఉండేవారు.

నా తండ్రి ఒక అద్భుతమైన వ్యక్తి. ఆయన పట్టిందల్లా బంగారమే. చదువుకునే రోజుల్లో ఆయన పేరొందిన ఆటగాడు. ఫుట్-బాలు, బాస్కెటు బాలు, టెన్నీసులలో ప్రవీణుడు. ముష్టియుద్ధం (Boxing) లో పరుగు పందేలలో మా జిల్లాలోనే శ్రేష్టుడు. ఆ తర్వాత ఆయన సర్కసు కంపెనీలో చేరి ఊయల విన్యాసాలు, గుర్రపు స్వారీలు అద్భుతంగా ప్రదర్శించేవాడు. కానీ ఆయన విశిష్ఠత మాత్రం దేహదారుఢ్య ప్రదర్శన, కుస్తీపట్లు; వీటిలో ఆయన ప్రఖ్యాతి గడించాడు.

దృఢంగా, ఆరోగ్యంగా, సమర్థవంతమైన దైహిక పుష్టిని పొందటానికి అనువైన పరిస్థితిలో నేను జన్మించాను. మా పితరులు పట్టుదలతో అభ్యసించిన పలు రకాల శారీరక సాధనలన్నీ నాకు తేలికగా లభించాయి. అంతేకాక మా తల్లిదండ్రులు వారి కలలన్నీ నాలో తీరాలనీ, నన్నొక గొప్ప క్రీడాకారునిగా తయారుచేయాలనీ చాలా జాగ్రత్తగా పెంచారు. మంచి ఆరోగ్యం, దృఢత్వం, బలం, ప్రాణశక్తి పెంపొందటానికి ఏమేమి చేయాలో వారి జ్ఞానం, వారు సంపాదించిన అనుభవం రంగరించి నన్ను పెంచడం ప్రారంభించారు. ఇలా సాధించడంలో ఉపయోగపడే ఏ ఒక్కదాన్నీ వాళ్ళు ఉపేక్షించలేదు. పుట్టినప్పట్నించీ నాకు మంచి ఆరోగ్యాన్నీ, దాని పరిరక్షణకు కావలసినవాటన్నిటినీ ఏర్పరిచారు. అంటే మంచి ఆహారం, బట్టలు, నిద్ర, పరిశుభ్రత, మంచి అలవాట్లు నేర్పటం మొదలైనవాటిని సమకూర్చేవారు. ఆ తర్వాత పద్ధతి ప్రకారంగా దైహికశిక్షణ యిచ్చి (చేయించి) నా శరీరానికి మంచి పొందిక, అవయవ సౌష్టవం, సౌమ్యత, లయబద్ధత, సమత వచ్చేటట్లు చేశారు. ఇవి కాక చలాకితనం, సాహసము, మెళకువ, సమన్వయము నేర్పించి చివరకు శరీరానికి దృఢత్వం, సహనం (తాలిమి) రావటానికి కావలసిన శిక్షణ నిచ్చారు.

నన్నొక బోర్డింగు స్కూలులో చేర్పించారు. సహజంగా అక్కడి దైహిక విద్య

నన్నాకర్షించింది. అందులో నా ఆసక్తి క్రమంగా వృద్ధిపొంది కొద్ది సంవత్సరాల్లోనే ఆ స్కూల్లోని ముఖ్య క్రీడాకారులు, క్రీడాయోధుల సరసన చేరిపోయాను. ఆ తర్వాత వివిధ పాఠశాలల మధ్య జరిగే ముష్టియుద్ధపు పోటీలలో నేను విజేతగా నిలిచాను. వారి కలలు సాకారమయ్యే మార్గంలో నేనుంటం చూసి మా తల్లిదండ్రులు ఎంత సంతోషించారో కదా! ఈ విజయం ఇచ్చిన ప్రోత్సాహంతో అప్పట్నించీ నేను నా ఉత్సాహాన్నీ, పట్టుదలనీ, శ్రద్ధనీ, శ్రమనీ అన్నిటినీ దైహిక విద్యలోని అన్ని విభాగాలలలో మెళకువలనూ, నేర్పరితనాన్నీ పొందటానికే వినియోగించాను. వివిధ క్రీడారంగాలలో పాల్గొనడం ద్వారా దేహం యొక్క అన్ని సమర్థతలనూ పెంపొందించు కోవడం నేర్చుకున్నాను. ఆ విధంగా సమగ్ర దైహిక శిక్షణ ద్వారా అత్యధిక సాఫల్యతను పొంది ఒకటికి మించిన కార్యక్రమాలలో ప్రవీణుడను కావచ్చనేది నా నమ్మకము. అందువల్లనే అవకాశమున్నంత వరకూ అన్ని క్రీడాపోటీలలోనూ పాల్గొనేవాడిని. ఆ తర్వాత ప్రతి సంవత్సరం జరిగే అన్ని పోటీలలో నేనే గెలిచేవాడిని.: కుస్తీలు, ముష్టియుద్ధం, బరువు లెత్తడం, అంగసౌష్టవం, ఈత, పరుగుపందేలు, టెన్నిసు, సాముగరిడీలు, తదితర పోటీలలో నేనే విజేతను.

నా కప్పుడు పద్దెనిమిది సంవత్సరాలు నిండాయి జాతీయ క్రీడాపోటీలలో పాల్గొనాలని నా కోరిక. సర్వవిధాల సాకల్యాభివృద్ధి పొందాలనుకొనేవాడిని కాబట్టి దశాంగ విన్యాస క్రీడ (Decathlon) లో పోటీ చేయాలని నిశ్చయించుకున్నాను. అది అన్నిటిలోకీ అధిక కఠినమైనది — వేగము, బలము, తాలిమి, సమతుల్యత మొదలైన లక్షణాలన్నిటిలో అత్యంత శిక్షణ కావలసిన పోటీ అది. నేను ఆ శిక్షణ తీసుకొని ఆరు నెలల్లో పోటీలో పాల్గొని నా పోటీదారుని బాగా వెనక్కు నెట్టి నేను చాలా ముందుకు పోయి విజేతనయ్యాను.

ఈ విజయంతో జాతీయ దైహికవిద్యా కార్యకర్తలు నన్ను ఒలింపిక్ పోటీలకు పంపాలని నిశ్చయించారు. రెండు వంవత్సరాల తర్వాత జరగబోయే ప్రపంచ ఒలింపిక్ పోటీలలో డెకాత్లాన్ పోటీలలో నా దేశం తరఫున పాల్గొనే అవకాశం నాకు కలిగింది. ప్రపంచంలోనే ఉత్తమశ్రేణి యోధులు కలిసి పాల్గొనే క్రీడలలో పోటీ చేయటమంటే మాటలు కాదు కదా! నాకు వెచ్చించటానికి ఎక్కువ సమయం కూడాలేదు.

వెంటనే మా తల్లిగారి పోషణలో, నా తండ్రి వద్ద శిక్షణ ప్రారంభించాను. చాలా ఎక్కువగానే కష్టపడవలసి వచ్చింది. ఒక్కొక్కసారి కష్టపడలేక ఇంక ముందుకు

పోవడం అసాధ్యమనిపించేది. ఎలాగో అలాగ అతికష్టం మీద రోజులు, నెలలు గడిచాయి. చివరకి ప్రపంచ ఒలింపిక్ క్రీడాదినం దగ్గరకు చేరుకున్నాను.

గొప్పలు చెప్పుకోడం కాదు గానీ, ఒలింపిక్స్‌లో నేననుకున్నదాని కంటే చాలా బాగా ఆడాను. డెకాత్లాన్‌లో నేనెన్ని ఎక్కువ గణాంశాలు (points) సంపాదించానంటే అవి ఇంతవరకూ ఎవరూ సాధించనివీ, ఇక మీద సాధించబోనివీ. అవి సాధించవచ్చని ఎవరూ ఊహించనన్ని సాధించాను. కానీ అది జరిగింది, అలా నా ఆకాంక్ష, నా తల్లిదండ్రుల ఆకాంక్ష నెరవేరింది.

కానీ నాలో ఏదో విపరీతం జరిగింది. నేననుకున్న విజయము, కీర్తి పరాకాష్టకు చేరుకున్నా ఏదో ఒక రకమైన విషాదము, శూన్యము మెల్ల మెల్లగా నాలో ఆవరిస్తున్నట్లనిపించసాగింది. నాలో ఏదో వెలితి కనిపిస్తున్నదని, దేనినో ప్రతిష్ఠించుకోవాలనీ యెవరో చెపుతున్నట్లు అనిపించసాగింది. నా దైహిక పాటవం, సామర్థ్యం, శక్తులతో మరింత బాగా సాధించవలసింది ఏదో ఉందని చెపుతున్నట్లు తోచింది. అయితే అది ఏమై యుంటుందనేది నా ఊహకి అందట్లేదు. ఈ భావం ఎక్కువ కాలం వేధించలేదు. ఆ తర్వాత చాలా ప్రముఖమైన పోటీలలో పాల్గొని అన్నింటిలో బాగా రాణించాను. అయితే ప్రతి విజయం తర్వాతా ఈ భావం నాలో తలెత్తుతూనే ఉంది.

నా పరపతి నలుదిశలా వ్యాపించడంతో చాలామంది యువకులు నా చుట్టూ చేరి వివిధ రకాల దైహిక శిక్షణల్లో వారికి సహాయంగా ఉండమని అడిగారు. అలా వారికి శిక్షణ నివ్వడం మొదలుపెట్టాను. ఈ విధంగా నాకెంతో ఇష్టమైన ఆటల్లో, దైహిక వ్యాయామాల్లో ఇతరులకు సాయపడటంలో ఎంతో ఆనందాన్ని పొందాను. ఆ విధంగా క్రీడాశిక్షకునిగా కూడా నేను బాగా పనిచేశాను. నా శిష్యులు చాలామంది అనేక క్రీడారంగాలలో మంచి ఫలితాలు సాధించారు. ఇలా దైహిక విద్యా గురువుగా మంచి ఫలితాలు కనబడడం కారణం గానూ, నాకు క్రీడారంగంపై ఉన్న మక్కువ వల్ల వాటితో అనుబంధం వదులుకోడం ఇష్టం లేకనూ, ఈ దైహిక శిక్షణావృత్తినే జీవనభృతికి ఎంచుకోవాలనుకున్నాను. దానికి తయారవటంలో భాగంగా దాన్ని శాస్త్రోక్తంగా అభ్యసించాలని దైహిక విద్యా కళాశాలలో విద్యార్థిగా చేరాను.; నాలుగు సంవత్సరాలలో పట్టభద్రుణ్ణయాను.

అభ్యాసంలోనూ, శాస్త్రంలోనూ కూడా దైహిక విద్యాప్రవీణుడనైనాను కాబట్టి

నేను ఆ రంగంలోనే పనిచేయడం మొదలుపెట్టాను. నేను క్రీడాయోధునిగా ఉన్నంత కాలం మంచి ఆరోగ్యం, బలం, నేర్పు, దేహసౌష్టవం పెంపొందించుకుంటూ శారీరక పరిపూర్ణత సాధించటం పైనే దృష్టి పెట్టేవాడిని. ఇప్పుడు మిగతావారు కూడా నా మాదిరే అవ్వాలనే ఉద్దేశ్యంతో వారికి సహాయపడటం మొదలుపెట్టాను. దేశమంతటా ఉపాధ్యాయ శిక్షణా కేంద్రాలను ఏర్పరచి దైహికవిద్యలో అత్యుత్తమ శిక్షకులనూ, సంచాలకులనూ తయారుచేశాను. వారి సహకారంతో దేశం నలుమూలలా అనేకానేక దైహిక విద్యా కేంద్రాలను తెరిపించాను. ఈ కేంద్రాల ప్రధానోద్దేశం సాధారణ ప్రజానీకానికి ఆరోగ్యాన్ని గురించీ, దైహిక విద్య, ఉల్లాస కార్యకలాపాలు మొదలైనవాటిని గురించీ, వాటిని సమకూర్చుకొనే శాస్త్రీయ విధానాన్ని గురించీ అవగాహన కలిగించాలనేది. ఆ నా ఉద్దేశం నెరవేరి కొన్ని సంవత్సరాలకు నా దేశప్రజల ఆరోగ్యం చాలా బాగా మెరుగుపడింది. ఇంకా వారు స్వదేశంలోనూ, విదేశాల్లోనూ గూడా ఆటల పోటీల్లో మంచి ఫలితాలు చూపించారు. అనతి కాలానికే క్రీడాప్రపంచంలో నా దేశం అంతర్జాతీయంగా గొప్ప ఖ్యాతి గడించింది. నా దేశం నాకు ప్రత్యేక సహకారాన్ని అందిస్తూ దైహిక విద్యామంత్రిగా నియమించటం వల్లనే నేనింత చేయగలిగానని ఒప్పుకోక తప్పదు.

ఆ తర్వాత ప్రపంచం నలుమూలలా గొప్ప దైహిక విద్యావేత్తగా, సంస్థాపకునిగా నా పేరు మారుమోగింది. అందులో అంతర్జాతీయ నిపుణునిగా నాకు గుర్తింపు వచ్చింది. అయా అధికారుల దగ్గర్నుండి వారి వారి దేశాల్లో నా దైహిక విద్యావిధానాల గురించి మాట్లాడమనీ, దాన్నక్కడ ప్రవేశపెట్టమనీ నాకు ఆహ్వానాలు అంద నారంభించాయి. భూమ్మీద అన్ని మూలల నుంచి నా సలహా సంప్రదింపుల కోసమని గుట్టలు గుట్టలుగా ఉత్తరాలు అందుతుండేవి.

ఇంత వ్యవహారం నడుస్తున్నప్పటికీ నా మనసులో నిరంతరమైన ఆలోచన ఒకటి తలెత్తుతూనే వుంది; నా శక్తియుక్తులు, దేశమంతా విస్తరించిన నా సంస్థ ద్వారా పెరుగుతున్న ప్రభావం, అంతర్జాతీయంగా నాకున్న గొప్ప పరపతి వీటన్నిటినీ పరమోదాత్తమైన ఘన ప్రయోజనాలకై ఉపయోగిస్తే బాగుంటుది కదా! అప్పుడే నేను చేసినదానికి పరమార్థం కదా అనిపించసాగింది. కానీ ఏం చేయాలో అనేది ఇప్పటిదాకా తెలియలేదు.

ఒక్కొక్కసారి నన్ను 'సూపర్ మేన్' అని కూడా అనేవారు. కానీ నేను సూపర్

మేన్‌ని కాదు. నేను ప్రకృతికి బానిసనే, మనిషికుండే అజ్ఞానం, పరిమితులు, అసమర్థతలు నాకున్నాయి. ఇంకా ప్రమాదాలు, అస్వస్థతలు, శక్తినంతా ఓడ్చివేసే ఉద్రేకాలు మొదలైన వాటికన్నిటికీ తలొగ్గవలసిందే. నేను వీటికి వేటికీ అతీతుడను కాననీ, ఇంకా నేర్చుకోవలసిందీ, సాధించవలసిందీ ఏదో ఉందనేది నిజము.

ప్రస్తుతం మృత్యుముఖంలో ఉన్న నేను చావటానికి ఏమాత్రం భయపడటం లేదు. అమిత బాధ, ఆకలి, దప్పికలను గురించి ఆలోచన వచ్చినా అది నన్నేమీ చేయలేదు. కానీ జీవితంలో నన్ను వేధించే సమస్యలను పరిష్కరించుకోలేకపోయాననే నా బాధ. జీవితంలో ఎంతో విజయాన్నీ, ప్రఖ్యాతినీ, గౌరవప్రపత్తులను, ధనాన్నీ, ఇంతెందుకు మానవుడు కోరుకునేవన్నీ కూడా సంపాదించాను. కానీ ఇవేవీ నాకు సంతృప్తి నివ్వలేదు, నా ప్రశ్నలకు సమాధానం దొరకలేదు.

ఇవన్నీ ఉండగా నాకు లభించనిది ఏమిటి? నా శరీర పరిపూర్ణత్వానికీ, నా సామర్థ్యానికీ ఉత్తమమైన ప్రయోజన మేమిటి? దేశవ్యాప్తమైన నా వ్యవస్థకూ, అంతర్జాతీయ పరపతికీ సరైన ప్రయోజనం ఏమి కాగలదు?

మూలం: ప్రణబ్

అనువాదం: అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామశాస్త్రి

ఈ భువిపై రూపుదాల్చే సమయం ఆసన్నమైంది. అందువల్లే మీరంతా అసంతృప్తితో ఉన్నారు. జీవితంలో ఆశించినదాన్ని అందుకోలేకపోతున్నామని చింతిస్తున్నారు. ఈ ప్రపంచపు అస్పష్టత నుండి, దురవస్థ నుండి విముక్తిపొందే అవకాశాన్ని ఈ ఒక్క మౌలికమైన చైతన్య పరివర్తన మాత్రమే అందివ్వగలుగుతుంది. ఈ చైతన్య పరివర్తనం, ఈ ఔన్నత్య సత్యావిష్కరణ కేవలం ఒక అవకాశ సిద్ధి మాత్రమే కాదు. అది తప్పక జరిగితీరనున్న వాస్తవం. నిజానికి ఇదే మన అస్తిత్వధ్యేయం. పృథివి పైనున్న సర్వమానవ జీవనోద్దేశం. తొలుత ప్రస్తుత చైతన్యం పరివర్తన చెందడం, పిదప జీవితం, తర్వాత రూపం పరిణామగతంగా వికసించడం — ఇదీ కొత్త సృష్టిక్రమం. ఈ కొత్త సృష్టి తప్పక జరిగితీరుతుంది. మూలకణాలు మొదలుకొని ఈ సువిశాల విశ్వందాకా, క్రియాశీలమైన ప్రకృతి చైతన్యం యావత్తు క్రమానుగతంగా ఆ మహత్తర సత్యచైతన్యంలోకి తిరిగి చేరుకుంటుంది. ఇదే విశ్వం యొక్క మూలం, లక్ష్యం కూడా. స్వాభావికంగా మనం ఏమిటో దాన్ని మనం పొందాలి. మన అంతరంగం లోతుల్లో దాగి ఉన్న సత్యసౌందర్యాలతో, శక్తిపరిపూర్ణతలతో కలిసి సంపూర్ణంగా జీవించాలి. అప్పుడు మన జీవితం ఒక మహత్తర అనంత దైవీయ ఆనందంగా ప్రకటితమౌతుంది.

(అక్కడ — ఆ ఆరుగురు నిశ్శబ్ద దృక్కులతో అంగీకార సూచకంగా మౌనంగా ఉండిపోతారు.)

రచయిత:

నీ వాక్కులలో ఏదో కట్టిపడేసే బలం ఉంది. ఏదో సర్వవ్యాపకశక్తి నిండి ఉంది. అవును, ఒక కొత్త ద్వారం మా ముందు తెరచుకున్నది. ఒక కొత్త ఆశ మా హృదయాలలో ఉద్భవించింది. కాని, దీన్ని సాధించడానికి చాలా వ్యవధి పట్టవచ్చు. ఇప్పుడేమో మా కోసం మృత్యువు వేచి ఉన్నది. అంతిమ ఘడియలు ఆసన్నమైనవి. అయ్యో! కాలాతీతమైపోయింది!

అజ్ఞాత మానవుడు:

కాదు కాదు. కాలాతీతం ఎంతమాత్రం కాలేదు. ఎన్నటికీ కాదు.

ఒక మహోన్నత ఆకాంక్షతో మనమంతా మన సంకల్పాన్ని ఏకం చేద్దాం. దైవానుగ్రహం దోహదంకై ప్రార్థిద్దాం. అద్భుతాలు ఎప్పుడూ సాధ్యమయ్యేవే. ఈ విశ్వాసానికి పరమ శ్రేష్ఠమైన శక్తి ఉంది. ఈ దివ్యపరిణామ మహదావకాశంలో భాగ

స్వాముల మౌదాం. అప్పుడు దేవుడు జోక్యం చేసుకొని దిగివచ్చి మన జీవితాలను వృద్ధిపరుస్తాడు. విజ్ఞుల వినయంతో, పసిపాపల నిష్కళంక స్వచ్ఛతతో ఆరాధిద్దాం. ఈ నవచైతన్యాన్ని, ఈ కొత్త శక్తిని, సత్యాన్ని, సౌందర్యాన్ని ఆర్తి పూరిస్తూ ఆహ్వానిద్దాం. అప్పుడివన్నీ ఏకంగా వ్యక్తీకరింపబడి తీరుతాయి. ఈ లోకం పరివర్తనం చెంది ఈ భౌతిక ప్రపంచంలో అతిమానస దివ్యజీవనం అవతరిస్తుంది.

(వాళ్లందరూ ఏకాగ్రతతో మౌనంగా ఉంటారు. అజ్ఞాత మానవుడు కొన సాగిస్తుంటాడు ఇలా:)

"ఓ సర్వోత్కృష్ట సత్యమా! నీవు విప్పిన ఈ మహాద్భుత రహస్యంతో మమేకమై మేమందరం పరిపూర్ణంగా జీవించేలా దీవించు తండ్రీ!"

(వాళ్లు అందరూ మంద్రస్థాయిలో ఆ మంత్రాన్ని మౌనంగా ఏకాగ్రతతో జపిస్తుంటారు. అంతలోనే కళాకారుని అరుపు)

చూడండీ! చూడండీ!

(దిగంతరేఖ మీద బిందువు ప్రమాణంలో ఒక నావ కనిపిస్తుంది. మెల్లమెల్లగా పడవ దరికి చేరుతుంది. కేకలు! అప్పుడు అజ్ఞాత మానవుడు అంటారు:)

మన ప్రార్థన ఫలించింది!

(నావ చేరువై స్పష్టంగా కనిపించాక క్రీడాకారుడు పడవ అంచుల పైకి గెంతి జేబులోని తెల్లని రుమాలును దులిపి ఊపుతాడు. నావ తీరం చేరుతుంది. శాస్త్రజ్ఞుడు కేకలేస్తాడు)

వాళ్లు మనలను చూశారు. వస్తున్నారు వాళ్లు.

(అజ్ఞాత మానవుడు అంటాడిలా మెల్లమెల్లగా మంద్రస్వరంతో)

ఇదిగో, ఇక్కడే ఉంది విమోచనం!

ఇక్కడే ఉంది కొత్త జీవనం!

(తెర పడుతుంది)

మూలం: శ్రీమాత

అనువాదం: నాగరాజు రామస్వామి

# యోగం: కర్మలలో నైపుణ్యం

*యోగం అంటే కర్మలలో నైపుణ్యం (గీత): అంటే అర్థం ఏమిటి?*
యోగం అంటే కర్మలలో నైపుణ్యం అని గీత చెబుతుంది. మనస్సు, అంతస్థిత చైతన్యపు పరివర్తనకే యోగం అని పేరు పెట్టింది గీత. దీనివల్ల ఒక పరిపూర్ణమైన అంతర్గత సమన్వయ స్థితి లభిస్తుంది. విత్తు నుండి చెట్టు వలె కర్మకు సంబంధించి సమ్యక్ సూత్రం, సమ్యక్ ఆధ్యాత్మిక, దివ్య కర్మ పర్యవసానం సహజసిద్ధంగా ప్రభవిస్తుంది. మరింత తెలివైన సైన్యాధికారి, రాజకీయవేత్త, న్యాయవాది, చెప్పులు కుట్టేవాడు యోగులని అనడం అర్థరహితం.!!!!!

కర్మలలో ఏ రకం నైపుణ్యమైనా యోగం అని అర్థం కాదు. యోగం అంటే విశ్వజనీన సమానత్వపు ఆధ్యాత్మిక ప్రాభవాన్ని, భగవత్ సాయుజ్యాన్ని యోగం అని అనాలి. ఇంద్రియ-మనస్సుకు సంబంధించిన అహంకారం, ఇంద్రియాల సంకెళ్ళ నుండి విముక్తిచెందిన మానవ ప్రకృతిలో దివ్య, విశ్వజనీన పరమాత్మ లయలకు ఆత్మ, దాని ఉపకరణాలు పరిపూర్ణంగా ఇమిడిపోవాలి.

## యోగం, ఉపయోగం —

వర్తమాన అస్తిత్వ జీవనవిధానాలను దాటిపోయి, మరింత ఉన్నతమైన, నవ్యమైన, విస్తృతమైన సాధారణ మృగప్రాయమైన, బుద్ధిజీవి అయిన మనిషికి వర్తించని చైతన్యస్థితికి చేరే విధానానికి యోగం అని అంటారు. అహంకారబద్ధమైన చైతన్యానికి బదులు విశ్వజనీనమైన లేదా విశ్వచేతనను పొందడం యోగం అంటారు. అంతేకాదు. విశ్వాతీతమైన, నామరహితం తత్వం వైపు చైతన్యం ఎదగడం యోగం అవుతుంది. ఆ నామరహిత మహత్వం సర్వసృష్టికి మూలం, ఆధారభూతం. మనిషి ఏ భగవద్దివ్య చైతన్యశిఖరాల నుండి దిగి వచ్చాడో అటువైపు, అలోచించే మానవ మృగతత్వం ప్రయాణించడం యోగంగా పరిగణించాలి. ఈ అధిరోహణలో ఎన్నెన్నో దశలు, స్థాయిలు, ఎన్నో పర్వత ఔన్నత్యాలు దాటాలి. వాటి శిఖరాగ్రంపై సర్వసృష్టికి కారణభూతమైన మహాసత్యం భాసిస్తుంటుంది. ప్రతి దశలోనూ గీత ప్రవచనం ఆ దశకు మరింత ఉన్నతతత్వాలను ఆవిష్కరిస్తుంది. ఈ ప్రపంచంలోకి ఆత్మ దిగిరావడం వల్ల ఎదురయ్యే ప్రమాదాల నుండి ఈ కొత్త సూత్రం ఏ కొంచెమైనా రక్షిస్తుంది.

జ్ఞానవికాసం లేని బుద్ధి ఎంత సునిశితమైనా, ఎంత వివేకం ఉన్నదైనా అజ్ఞానంతో బంధితమవుతుంది, పరిమితమవుతుంది. అటువంటి అజ్ఞానం వల్ల జనించే ప్రమాదాల నుండి ఈ సూత్రం రక్షిస్తుంది. కల్మషం నిండిన హృదయం ఎంతటి సుసంపన్నమైన ఆకాంక్షను, భావాలను కలిగియున్నా అనుభవించే బాధలు, పాపాల నుండి ఈ సూత్రం రక్షిస్తుంది. ఎంతటి శక్తివంతమైనా, ఎంతటి విజయవంతమైనా మానవుని దివ్యీకృతం కాని సంకల్పం కర్మలకు శాశ్వతంగా కట్టుబడి వుంటుంది. అటువంటి నిరుపయుక్త కర్మల నుండి ఈ సూత్రం కాపాడుతుంది. మన సాధారణ మానవ జీవన విషవలయం నుండి మనం తప్పించుకోడానికి ఒక మార్గాన్ని ఈ యోగం చూపిస్తుంది.

## మామూలు మనిషి, యోగి పనితీరులు

గీత దృష్టిలో కర్మల భావన చాలా విస్తృతమైనది మనిషిలోని ప్రకృతి చేసే సర్వకర్మలు — అంతర్గతమైన, బాహ్యమైన, మనసులోనివైనా, దేహాని నడిపేవైనా, గొప్పవైనా, అల్పమైనవైనా — అన్నీ ఈ భావన గొడుగు క్రిందికి వస్తాయి. ఒక అధినాయకుని పరిశ్రమ అయినా, ఒక చెప్పులు కుట్టేవాని పనైనా, ఒక ఋషి తపస్సైనా, భోజనం చేసే ప్రక్రియ అయినా అన్నీ ఈ జాబితాలోకి వస్తాయి. ఆలోచన ద్వారా పరమాత్మ అన్వేషణ, హృదయోద్వేగాలతో మహోన్నత దైవాన్ని ఆరాధించడం, సాధన ఉప కరణాల, శక్తులు అన్నింటినీ భగవంతుని, మానవుని సేవకు ఉపయోగించడం — అన్నీ ఇచట సమానమే.

తన చీకటి గుహలో మౌనంగా, నిశ్చలంగా ఆశీనుడైన ముని, బోధివృక్షం నీడలో కూర్చొని నిత్యసత్య జ్యోతిర్వలయాన్ని సొంతం చేసుకొన్న బుద్ధుడు, భారతదేశం అంతటా తుఫానులా చెలరేగి, నిష్కర్మ-వైభవాన్ని గూర్చి అత్యంత చైతన్యస్ఫోరకంగా అందరితో చర్చించి, అందరినీ ఓడించిన అద్వైత తేజోమూర్తి శంకరుడు ఈ దృష్టితో చూస్తే మహనీయమైన, శక్తిప్రదమైన కర్మ చేసినట్లే. బాహ్యమైన కర్మ పైకి ఒకేలాగా కనిపిస్తుంది. సామాన్యమైన మనిషి పనికి, యోగి చేసే పనికి మధ్య అంతరంగికమైన విభేదం చాలా ఉంది. చైతన్యస్థాయిలో, ఆత్మశక్తిలో, సంక ల్పంలో స్వభావంలో విభేదం ఉంది.

## దివ్య అస్తిత్వం అపరిమితం

మనం ఎవరమో, ఏమిటో అక్కడ నుండి మనం చేసే పనులు రూపుదిద్దుకుంటాయి. సత్ పురుషుడు తనకు తానెవరో బాగా ఎరుక కలిగి వుంటాడు. చైతన్యమే జ్ఞాన, శక్తులుగా మారుతుంది. ఈ రెండు రకాల కోణాల శక్తి క్రియగా మారిన ఫలితమే కర్మసంచయం. అస్తిత్వశక్తి రూపాలే మనస్సు, శరీరం, జీవితం. అందులో ఉన్నదాని నుండే అవి పనిచేస్తుంటాయి. తమ స్వభావం ప్రకారం జీవులంతా పనిచేస్తుంటారని అన్నప్పుడు ఆ అర్థం తీసుకోవాలి. తన సమస్తాన్నీ తన అధీనంలో వుంచుకొన్న అపరిమిత దివ్య అస్తిత్వం నిర్మలం, పవిత్రం. అదే సత్. తన స్వీయ ఎరుక యొక్క అపరిమిత నిర్మలత్వంలో, దేనిని పూజిస్తుందో అది దాని యొక్క సత్యామే — సత్యం. దివ్యజ్ఞానం పరమ సత్యజ్ఞానమే. దివ్యసంకల్పం పరమ సత్యశక్తియే. దివ్య కర్తృత్వాలు సత్యం నుండి ప్రవహించే మాటలు, భావసముదాయాలు. సహస్ర రూపాలుగా సహస్ర దశలలో అనంత బంధాలలో అవి తమను తాను తెలుసుకొంటాయి. కాని భగవంతుడు ఏ ఒక్క కర్తృత్వానికి గానీ, ఏ కాల క్షణానికి కానీ, ఏ ప్రదేశానికి గానీ, ఏ సంబంధ సూత్రానికి గానీ పరిమితుడై ఉండడు. ఎందుకంటే ఆయన విశ్వజనీనుడు అనంతుడు. ఈ విశ్వానికి కూడా పరిమితం కాడు. ఆయన అనంత తత్వం విశ్వసదృశం కాదు, విశ్వాతీతం.

## వ్యక్తి కర్మలు పరిమితం

కాని వ్యక్తి పరిమితుడు. కాలానికి బంధితుడు. ఆ విధంగానే అతని కర్మలుంటాయి. అస్తిత్వం పనిచేసే తీరు, తాను వున్నానన్న భావన, దేశకాలాదులకు లోబడి పని చేయడం, పనిచేసే విధానంలో వున్న పరిస్థితులు, ఆ క్షణం, ఆ ప్రదేశం — ఇవన్నీ స్వయం — వ్యక్త సత్యాలుగా, సంఘటనల వెనుక నిలిచిన సత్యంగా అతడు పరిగణించడం జరుగుతుంది.

వ్యక్తి, వ్యక్తి జ్ఞానం, శక్తి, సంకల్పం, ప్రపంచంతోనూ, తోటిమానవులతో అతని సంబంధాలు, ప్రపంచంలో అతని అవసరం, వారి నుండి అతడు కోరుకొనేది — ఇవన్నీ చాలినంత సత్యంగా, వాస్తవంగా అతను పరిగణిస్తాడు. అతని కర్మలు ప్రారంభమయ్యే బిందువును కేంద్రీయ వాస్తవికతకను విశ్వసూత్రంగా పరిగణిస్తాడు.

అహంకారపూర్ణమైన ఈ తప్పిదం నుండి సమస్తాన్ని విషేధించే అసత్యం బయలుదేరుతుంది. విశ్వజనీనతనూ, సర్వ-అస్తిత్వాన్నీ, సర్వ-జ్ఞానాన్నీ, సర్వ-సంకల్పాన్నీ సవ్యంగా ప్రతిబింబిస్తూ తనకు తానుగా దానితో బాంధవ్యాన్నే ర్పరచుకొంటూ, తనలోనే ఉన్న మహదానందం వైపు, ఆత్మోపలబ్ధి వైపు సదా సాగిపోతుంటే తప్ప, వ్యక్తిగా తయారైన, ప్రత్యేకత సంతరించుకొన్న దానికి స్వీయ అస్తిత్వంగాని, యదార్థతగాని, పటిష్టశక్తి గాని వుండవు. అందువల్ల తనను తాను విశ్వజనీనం చేసుకోడంలోనే వ్యక్తికి మోక్షసిద్ధి కలుగుతుంది. (దానిని salvation అని శ్రీఅరవిందులు అన్నారు.) జీవితం ఈ పాఠాన్ని ఎప్పుడూ అతనికి బోధిస్తుంటుంది. కాని మార్పు కంగీకరించని అహంకారం తెలుసుకోడానికి ఇష్టపడదు. విశ్వజనీనత అంటే ఒక వర్గం కాదు. విస్తృతించిన అహం కాదు. కుటుంబం కాదు. సమాజం కాదు. జాతి కాదు. సమస్త మానవాళి కూడా కాదు. కాని, ఈ అల్పత్వాలన్నింటినీ దాటి ఉన్న 'అనంతం'.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

## జగన్నియమాతిక్రమణ

వ్యక్తిని నిజజీవితంలో మరింత స్వేచ్ఛాజీవిగా చేసినా, అతని అస్తిత్వంలోని యధార్థ స్వేచ్ఛకు సన్నిహితంగా తీసుకుపోయినా, విశ్వజనీనత అతనిని ముక్తుని చేయజాలదు. విశ్వజనీనమైనదానితో సమశృతి నుండడం అనేది మొదటి అడుగు. కాని విశ్వజనీనత కావల, దానిని నడుపుతున్న, నిర్దేశిస్తున్న జగదతీత అనంతత్వం ఒకటున్నది. కనుక సమస్తాన్నీ అతిశయించి ఉన్న దివ్యపురుషుని ప్రజ్ఞానాన్ని, పరమేచ్ఛను, మహాశక్తిని, అతని మహదానందాన్ని వ్యక్తం చేయడం మినహా విశ్వానికి కూడా స్వీయ అస్తిత్వం సత్యం, లేదా ప్రామాణికత లేదు. విశ్వాన్ని అతిశయించి వున్న ఆతనిని గురించి ఆలంకారికంగా చెప్పాలంటే అతని అస్తిత్వంలోని ఒక అల్పాంశంతో, ఆతని చేతన యొక్క ఏకైక కిరణంతో ఈ సమస్త లోకాలను అతడు సృజించాడు. అందుచేత విశ్వజనీనత సంతరించుకొన్న తన జగచ్చేతన

నుండి జగదతీతమై వున్నదాని వైపు తలెత్తి దృష్టి సారించాలి. ఆ అనుభవంతో తన అస్తిత్వానికి గల సంపూర్ణ అర్థాన్ని, కర్మల గతిని గ్రహించాలి. ఈ ప్రాథమిక సత్యం నుండి యౌగిక చేతన ప్రారంభమౌతుంది. అది వ్యక్తిని తనను తాను విశ్వ జనీనునిగా తయారుచేసుకొనడానికి, ఆ పిదప జగన్నియమాన్ని అతిశయించి పోవడా నికి సాయపడుతుంది. ఈ రూపాంతరీకరణ అతని అస్తిత్వపు స్థితి మీద మాత్రమే గాక కర్మలలో పనిచేసే చేతన మీద కూడా పనిచేస్తుంది.*

---

*(CWM Vol 3, pp 168-69 *లో ప్రచురించబడిన) ఇచట 1930-31 కి సంబంధించిన దివ్యజనని సంభాషణలో నుండి ఒక పాఠ్యాంశాన్ని పాఠకులకు అందించాలని అభిలషిస్తున్నాం.*

...యోగులకు ఎంతో ప్రియమైన విశ్వజనీన చేతన, దైవం కాదు అనే విషయాన్ని మనస్సులో ఉంచుకోక తప్పదు. నీవు కావాలనుకొంటే నీ చుట్టూ వున్న పరిమితులను సమాంతరంగా భగ్నం చేసుకోవచ్చు. అప్పుడు అనుభవానికొచ్చే వైశాల్యతను, జగత్తుకు సంబంధించిన నానాత్వం యొక్క భావనను, దైవం అనుకొంటే నీవు చాలా పొరపడినట్లే. విశ్వజనీనతాభావ కదలిక కేవలం సత్యాసత్యాల మిశ్రమం మాత్రమే. అందుచేత అచట ఆగిపోవడం అంటే అపరిపూర్ణత దగ్గరే ఆగిపోవడం అవుతుంది. జగదతీత పరమ సత్యాన్ని ఎప్పుడూ పొందకుండా జగచ్చేతనలో నిరభ్యంతరంగా పాలు పంచుకోవచ్చు. ఆలా గాక, దైవం వద్దకు పోవడం అంటే విశ్వజనీనతా ఉప లబ్ధిని కూడా పొందినప్పటికీ అనృతం నుండి స్వేచ్ఛ కలిగి వుండడం అవుతుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి. రావు

# సమత అసలైన అర్థం

అంతరాత్మ మరియు మనస్సుల సమత్వమే యోగం అని గీత చెప్తోంది. ఈ సమత్వమే బ్రాహ్మీస్థితికి, యోగి ఆకాంక్షించే ఆ వున్నత అనంత చేతనకు పునాది అని కూడా గీత చెప్తోంది. మనస్సు యొక్క సమత అంటే విశ్వజనీనత. ఎందుచేత నంటే అంతరాత్మకు సంబంధించిన విశ్వజనీనత లేకుండా, ఉదాసీనతా స్థితి వుండవచ్చు లేదా ఒక నిష్పాక్షిక ఆత్మ-నియంత్రణ, లేదా చిత్తవృత్తికి సంబంధించిన, చక్కగా అదుపుచేయబడిన సమత ఉండవచ్చు, కాని దాని అర్థం ఇవేవీ కాదు. మనం చెప్పుకొనే సమత అంటే ఉదాసీనత లేక నిష్పాక్షికత, లేక హెచ్చుతగ్గులు లేకపోవడం కాదు. సమస్తమూ ఆ ఏకైకమే అని గ్రహించిన కారణం చేత సర్వుల యెడల, సమస్త వస్తువులు, సంభవతల యెడల ప్రాథమిక ఏకత్వ వైఖరితో వుండడమే. అటువంటి సమత్వంతో కర్మకు పొత్తు కుదరదని, తప్పుగా భావించారు. అదెంత మాత్రం కాదు: ఇది హేతుబుద్ధికి సంబంధించిన భ్రాంతివల్ల, అతని ఆశలు, భయాలు, రాగాల వల్ల లేదా భావోద్వేగానికి సంబంధించిన స్వసంకల్పిత యిష్టాయిష్టాల వల్ల హేతుసంబంధ భ్రాంతి వల్ల తనను తాను సమర్థించుకొనే బుద్ధి వల్ల మాత్రమే తప్ప మరి దేనివల్లా కర్మ చేయడం సాధ్యపడదు అని భావించే జాంతవిక మరియు బౌద్ధిక మానవుని తప్పు యిది. వ్యక్తి నిజమైన నటుడై వుండి, కేవలం ఉపకరణం లేదా అప్రధాన ఏజంటు కాకపోయినట్లైతే అదే వాస్తవం అవుతుంది. మన వ్యక్తిత్వాన్ని ఆధారం చేసుకొని, దాని ద్వారా పనిచేసే విశ్వవ్యాపకమైనది పరాశక్తి అని మనకు బాగా తెలుసు. ఎందుకనంటే విజ్ఞానశాస్త్రం, దర్శనశాస్త్రం అదే సత్యాన్ని ధృవీ కరిస్తున్నాయి. వ్యక్తిగత మనస్సు ఒక మహనీయ, అజ్ఞానంతో తనకు తాను ఎంచు కొన్నట్లు నాటకమాడుతూ విశ్వవ్యాపకమైన దానిని పరిగణించకుండా, అనృతపు ఆధారంపై, జ్ఞానంలో, పరమ సత్య సంకల్పంతో గాకుండా తప్పిదాన్ని ఆసరాగానే చేసుకొంటూ పనిచేస్తున్నదనేది స్పష్టం. కర్మలలో ఏ విధమైన వాస్తవ కౌశలాన్ని అది అందుకోలేదు. ఎందుకనంటే, మనం వెంట వెంటనే మార్చుకోవలసివచ్చే, చేసినంతసేపూ ఏడుస్తూ, పెనగులాడుతూ, బాధపడుతూ విరామం తీసుకొనేందుకు భద్రమైన చోటు లేకుండా, ఒక అసత్యం లేక అర్ధ-సత్యం దగ్గరకు చేర్చే, కర్మలను కౌశలం గల కర్మలు అని చెప్పలేం. కాని విశ్వవ్యాపకమైనది సమస్తంలోనూ సమంగా

ఉంటుంది. అందుచేత దాని నిర్దేశాలు, స్వ-సంకల్పిత మక్కువలచే గాక, పరిమిత రహితమైన, అసమర్థతకు, తప్పిదానికి లోనుగాని దివ్యసంకల్పపు సత్య, జ్ఞానాలచే నిర్దేశించబడతాయి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి. రావు

## జీవి అస్తిత్వంలో పురోగమనాత్మక పరివర్తనను సాధించేది యోగం

తన దేహపు లేక వ్యక్తిగత చిత్తవృత్తికి, లేదా పరిమితీకరించబడిన మనస్సుకు సంబంధించిన గోడల మధ్య గాక, సమస్తంలోని ఏకైక అస్తిత్వపు సమస్తాన్నీ, ఆలింగనం చేసుకొను అస్తిత్వపు చేతనకు గల పరిపూర్ణ సమతా పునాది నుండి ఉద్ధరించబడి ఆ ఉన్నత చేతనలో నివసించువాడు యోగి. ఆ స్థితే అతనిని సాధారణ మానవునికన్న భిన్నమైనవానిగా చేస్తుంది. తన అస్తిత్వంలో ప్రభవించి పరివర్తన చెందే చాలా అల్పమైనవిగా అతనికి మనః ప్రాణ దేహాలు కన్పిస్తాయి. అంతమాత్రమే కాదు, అతడు అల్పమైన అహంలో లేదా మనస్సులో నివసించువాడు మాత్రమే గాదు తానిప్పుడు సదా బృహత్తర అనంత ఆత్మతో అభిన్నుడైనవాడు. అట్టి తనలోనే సమస్త విశ్వం ప్రవర్తిల్లుతున్నట్లాతడు దర్శిస్తాడు. దివ్యమైన పరమ సత్యం, పరమ జ్ఞానం, పరమేచ్ఛ, పరమ శక్తి యొక్క వత్తిడి వల్ల ఈ అస్తిత్వం నుండి ఈ దివ్యమైన 'సత్' నుండి, విశ్వంలోని సమస్త కర్మ పర్యవసిస్తోందని దర్శిస్తాడు. విశ్వకార్యంలో పాలు పంచుకొని, దివ్య సత్యం వెలుగులో, దాని పాలనలో సమస్తాన్నీ చూడనారంభిస్తాడు. స్వయంగా, తన కర్మలు ఇతరులు చేసే కర్మలవలె గాక, మరో క్రమంలో జరుగుతున్నట్లు చూస్తాడు. తన స్వీకీయ ఆవేగాలు, ఇష్టాయిష్టాలు, తడుముడులాటలు, అన్వేషణలు, తిరుగుబాట్లచే తాను బంధించబడడు లేదా తక్కిన సమస్తానికీ సంబంధించిన సత్యానికి మూసుకొనిపోడు. అలా అభివృద్ధి చెందే దృష్టి వైశాల్యతకు అర్థం, జ్ఞానాభివృద్ధి అనేది సుస్పష్టం. జ్ఞానం అంటే శక్తి అన్న మాట నిజమైతే అది కర్మలు చేయడానికై పెరుగుతున్న క్రియాశక్తి కూడా అనే అర్థం తప్పక వస్తుంది.

కాని తన వ్యక్తిగత హేతుబుద్ధి, ఊహ, ఇచ్ఛలకు గల అల్ప ప్రకాశంలోనే యోగి కర్మ చేస్తుంటే ఆ అర్థం వర్తించదు. ఎందుచేతనంటే బుద్ధి మరి దానికి సంబంధించిన దానంతటి పైన ఆధారపడేదంతా కఠినమైన పరిమితులకు, పూర్తిగా బుద్ధి ఆదేశాల కనుగుణంగా పనిచేస్తాయి. తదనుగుణంగానే అప్రకాశ బుద్ధి, దాని సేవకులు కొనసాగించే కార్యకలాపం ఈ విశాల అస్తిత్వం నుండి పెల్లుబికే నూతన చేతనాస్థితితో విభేదిస్తుంది. అవి చురుకుగా ఉన్నంత కాలం నూతన చేతనా స్థితి పరిపూర్ణం కాలేదు, లేదా సురక్షితం అని చెప్పలేం. ఎందుకనంటే, వాటి సంకుచిత కార్యాలకుగల హక్కును ప్రకటించే అహం-అలవాటు యొక్క నిమ్న క్షేత్రం వైపుకు ఆ నూతన చేతన సదా లాగబడుతూంటుంది. తన బౌద్ధిక లేదా, భావావేశపూరితమైన ప్రకృతి కోరినదానిని బట్టి యోగి పనిచేయడం మానివేయడం అధికాధికంగా జరుగుతూంటుంది. గతానికి సంబంధించిన మానవ-మృగ మిశ్రమంలో మరో వెలుగు ప్రసరిస్తుంది, మరో శక్తి మరియు సన్నిధి జోక్యం చేసుకొంటాయి, ఇతర నిగూఢ శక్తిసామర్థ్యాలు మేలుకొంటాయి.

## అప్పుడు ఇచ్ఛ, చిత్తవృత్తుల సంస్కరణ జరుగుతుంది:

అస్తిత్వపు పరివర్తన జరిగినపుడు, ఇచ్ఛ, చిత్తవృత్తులు తప్పనిసరిగా సంస్కరణకు లోనవుతాయి. ప్రాథమిక దశ నుండి కూడా యోగి తన స్వీయ ఇచ్ఛను లోబరచుకొన నారంభిస్తాడు. లేదా అది సహజంగానే తనను ఉన్నత స్థితి వైపు ఆకర్షించు పరమోన్నత దివ్య సంకల్ప భావనకు తానుగా లోబడిపోతుంది. తన గత వ్యక్తిపరమైన జీవనంలోనికి, తన గత వ్యక్తిపరమైన కర్మలోనికి అనేక వెనకడుగులతో, పతనాలతో, అజ్ఞానంగా, అపరిపూర్ణంగా దోషభూయిష్టంగా దైవేచ్ఛ ప్రారంభంలో నడక సాగిస్తుంది. కాని కాలం జరిగిన కొద్దీ అది తన దివ్యమూలంతో సమశ్రుతిని సంతరించుకొంటుంది. కాలక్రమంలో వ్యక్తిగత సంకల్పం ఊర్ధ్వంలో కరగిపోతుంది. సమస్త మార్గాలు, సార్వత్రికతలో, అనంతంలో లీనమై విశ్వాతీతమైనదానికి అర్థతః విధేయమౌతాయి. బుద్ధిగత జాతి ఊహించినట్లుగా ఈ పరివర్తనం, ఈ ఆరోహణ, వ్యాకోచించడం అనే వాటి అర్థం, వ్యక్తిలో పనిచేస్తున్న ఇచ్ఛాశక్తి యొక్క ఎట్టి విధమైన నశింపు కాదు. పైపెచ్చు అది దానిని, అమిత శక్తివంతమైన స్థాయికి పెంచుతుంది. అదే సమయంలో దానికి అనంత స్థిరత్వాన్ని, శాశ్వత శాంతిని అందజేస్తుంది. చిత్తవృత్తి

కూడా సమస్త ప్రయాస, కోరికల పట్టు నుండి గాఢావేశ ప్రేరణ, కోరి తెచ్చుకొన్న ఆత్మ-భ్రాంతి వల్ల కలిగే బాధల నుండి విడుదల పొందుతుంది. కోరిక, ఎంత మంచిదైనా, అది పరిమితి వైపుకే, అనుమానాస్పద స్థితికే, తదితరాన్నంతట్ని కాదని ఏదో ఒకదాన్నే ప్రత్యేకించి ఎన్నుకొనే వేగిరపాటుకు, వత్తిడికి, విడచివేయదగని దానిని విడిచిపుచ్చాలనే ఒక రకమైన వత్తిడికి, దైవ తిరస్కారాలకు, కోరినదివ్వకుండా దైవం పట్టి వుంచడాలకు, వ్యతిరేకంగా తిరుగుబాటు చేయడానికి దారి తీస్తుంది. అది కోపాన్ని, విచారాన్ని, ఆవేశాన్ని, కాఠిన్యతను పుట్టిస్తుంది. ఇవి అంతరాత్మ తన దైవత్వపు స్మృతిని లేదా తనను గురించిన స్థిరచేతనను, స్వీయ-జ్ఞానాన్ని వస్తువుల సత్యం యెడల దానికిగల సమతాదృష్టిని కోల్పోయేటట్లు చేస్తాయి. కాబట్టి కోరికకు, దాని పటాలానికి కర్మలందు కౌశలంతో పొత్తు కుదరదు. ఇంకా అవి కొన సాగుతున్నాయంటే అది యోగం యొక్క అపరిపూర్ణతకు గుర్తు.

## నూతన శక్తిసామర్థ్యాలు పైకొస్తాయి

విషయాలకు సంబంధించిన సంకల్పంలో, ప్రాథమిక జ్ఞాన-దృష్టిలో మార్పు మాత్రమే గాక, గతశక్తిసామర్థ్యాల స్థానంలో నూతన శక్తుల కూటమి చోటు చేసుకొంటుంది. ఎందుచేతనంటే కేవల బుద్ధి మాత్రమే మన మానసిక కార్యాన్నంతా మన కోసం చేయకుండా ఉండాలంటే, దాని అప్రకాశ స్థితిలో అసలేమీ జరగకుండా ఉండాలంటే, కోరికలు, అభిలాషలు, బౌద్ధిక అభిమానాలు మన కర్మను నిర్దేశించకుండా, వత్తిడి చేయకుండా ఉండాలంటే, అప్పుడు ఇతర జ్ఞానశక్తులు, ఇచ్ఛాశక్తులు తప్పక మేలుకొని బుద్ధిని, మానసిక అభిమానాన్ని తొలగించి వాటి స్థానాన్నాక్రమించడం జరగాలనేది స్పష్టమే. లేదా అవి జ్ఞానాన్ని ప్రకాశవంతం చేసి, దారి చూపడం, సంకల్పాన్ని రూపాంతరం చెందించి దానిని లోబరచుకోవడం జరగాలి. అలా గాకపోతే అతని నిష్క్రియ సత్తా ఆనందకరంగా విశాలమైనప్పటికీ, కర్మలు లుప్తం గావడమో, కర్మప్రేరణలు యాంత్రికం, అస్తవ్యస్తం గావడమో జరుగుతుంది. ఎందు చేతనంటే కర్మలు విశ్వజనీనమైనదాని నుండే పెల్లుబుకుతూ వస్తాయిగాని, వ్యక్తి గతమైనదాని నుండి గాదు. హృదయం, మనస్సుల పొరపాటు చర్యలకు అనుమతి నిచ్చు విశ్వజనీనమైనదాని యొక్క నిమ్నసూత్రాన్నుండి అవి పైకి వస్తాయి. అటువంట ప్పుడు పొంతనలేని కర్మప్రేరణలపై, కొంత వెలుగును, క్రమబద్ధతను విధించడానికి,

గతానికి సంబంధించిన వ్యక్తిగత సంకల్పం, హేతుబుద్ధి అతనిలో వుండవు. అటువంటి శక్తులు, నూతన శక్తుల కూటములు, పైకి రాగలవు, వస్తాయి. అవి పరమ సత్యంతో సరాసరి సంపర్కం కలిగి వుండే, ప్రకాశాలు, మరియు శక్తులు. కనుక అవి వెలువడి, తమ తమ వ్యాపారాలను నిర్వహించడంలో ఎంతగా పట్టు సాధిస్తే, అందుకు తగిన నిష్పత్తిలో యోగి యొక్క కర్మకౌశలం, సూక్ష్మత, పరిపూర్ణత పెరుగుతుంది.

## అత్యున్నత యోగసామర్థ్యం

యౌగిక కర్మలలోని కౌశలం, జంతు మానవునికి ఒక పెద్ద అసంబద్ధ విషయంగా కన్పిస్తుంది. ఎంతో కష్టపడి ఇలా సాధించినదంతా, సంతసపరచే దేనిలోనికి తీసుకు పోయినా, మనం చివరకు మన వ్యక్తిగత జీవితాన్ని కోల్పోతాం. మనకు సంబంధించిన వ్యక్తిగతమైన వాటిని త్యజిస్తాం. మన వ్యక్తిగత సంకల్పాన్ని, ఆనందాన్ని లేకుండా చేసుకొంటాం. ఇవి లేని జీవితం, అసలు జీవించడానికే తగదు అని అతడు అంటాడు. సమస్త కౌశల కర్మల యొక్క లక్ష్యం, మన, ఇతరుల, లేదా అందరి యొక్క సుస్థిర సంక్షేమం అనేది స్పష్టం. క్షణికమైన, ఎప్పుడూ మారిపోతుండే లక్ష్యాన్ని సాధించుకోవడమే శ్రేయోదాయకం అని అతడనుకొంటాడు. దాని కోసం ఎంతో విచారం, బాధ, బాధాకరమైన శ్రమల ఊబిలో నుండి నడుచుకొంటూ పోవడం, మరో నూతన లక్ష్యాన్వేషణలో అదే సంక్షోభ స్థితిలో పడిపోవడమే శ్రేయోదాయకమని అతను భావిస్తాడు. మనస్సు చేసే ఈ మోసాన్ని, దాని కోరికలను, ద్వంద్వ వైఖరులను కనిపెట్టడం, తానొక్కడు అనుభవించడమే గాక ఇతరులకు కూడా పంచగల శాశ్వత శాంతి, విశ్వజనీన ఆనందం, సర్వాలింగక సంతృప్తిని కనుగొనడం యోగం యొక్క గొప్ప విలువైన సామర్థ్యం. అది కూడా మన అస్తిత్వం యొక్క పరివర్తన మూలంగా ఉద్భవిస్తుంది. ఎందుచేతనంటే సృష్టి యొక్క పరిశుద్ధ సత్యం తనలో సృష్ట్యానందాన్ని కూడా కలిగే వుంటుంది. అవి అనంతుని అస్తిత్వంలో అవిభాజ్యాలు. వేదద్రష్టలు చిత్రించిన రూపాల్లో చెప్పాలంటే యోగం వల్ల మనలో 'వరుణుడు' ఉద్భవిస్తాడు. వరుణ అంటే ఆధ్యాత్మిక జీవనం యొక్క ఒక విశాలాకాశం, విశాల అస్తిత్వమూ అనంత సత్యమూనైన దైవం. ఆ వైశాల్యతలో 'మిత్ర' లేచి వస్తాడు.

అతడే దివ్యవెలుగు, దివ్య(పేమకు (పభువు. ఆలోచన సంవేదన సంకల్పాలకు సంబం ధించిన మన సమస్త కార్యకలాపాలను తాను స్వీకరించి వాటినొక దివ్య సామరస్యతగా పూరిస్తాడు, మన కదలికకు సారథ్యం వహిస్తాడు, మన కర్మలను నిర్దేశిస్తాడు. ఈ వైశాల్యత, ఈ సామరస్యతలు ఆవాహన చేయగా 'ఆర్యమన్' మనలో (పత్యక్ష మౌతాడు. (పకాశమయ శక్తిగల దైవం, ఉద్ధరించబడిన అస్తిత్వపు శక్తి, సమస్తంయొక్క సత్యాన్ని అంచనా వేయగల (పభావవంతమైన సంకల్పం అతడు. ఈ ముప్పురు వల్ల అంతర్యామి 'భగ' అరుదెంచుతుతాడు. అతడు మన ఖేదపూరితమైన విభక్తమైన అస్తిత్వపు పీడకలను చెదరగొట్టు 'ఆర్యమన్' శక్తి యొక్క ఏకత్వంలో సమస్తాన్నీ తన అధీనం చేసుకొనే దైవం. ఈ దివ్యజన్మ మన కర్మలకు పుట్టిన బిడ్డ. దీనిని మనలో సృజించుకొనడం కన్న మరో మహోన్నత నైపుణ్యమేదైనా ఉండగలదా లేదా మరింత ఆచరణయోగ్యమైన సర్వోత్కృష్ట సామర్థ్యమేదైనా ఉన్నదా?

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి. రావు

## తెలుగులో చిన్న పుస్తకాల (పచురణ

శ్రీఅరవింద సొసైటీ (పస్తుతానికి 18 పుస్తకాలను తెలుగులో (పచురించింది. ఆ జాబితాను (కింద ఇస్తున్నాం. ఇవి ఇంతకు ముందు శ్రీఅరవింద సొసైటీ ఆంగ్ల (పచురణలకు తెలుగు అనువాదాలు.

ఈ చిన్ని పుస్తకాలలో శ్రీమాత, శ్రీఅరవిందుల (పవచనాలున్నాయి. ఆకాంక్షించువారికి విషయాన్ని పరిచయం చేయడానికివి చాలా బాగా ఉపయోగపడ్తాయి.

శ్రీఅరవింద సొసైటీకి సంబంధించిన (పతి శాఖ, కేంద్రం కొన్ని (పతులను కేంద్ర కార్యాలయం నుండి కొనుగోలుచేసి తమ వద్ద అందుబాటులో వుంచుకోవాలి. అందరికీ అందుబాటు ధరనే అంటే (పతి పుస్తకం రూ. 2.50 లకే పోస్టేజితో సహా అందించడం జరుగుతుంది.